# మనం

## కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

శనివారం | 13 |జూన్ | 2026 | పేజీలు: 13




## సర్ రూప కల్పనలో బీఎల్ఓ, బీఎల్ఓ సూపర్ వైజర్ల పాత్ర కీలకం

గుంటూరు జిల్లా డీఆర్ఓ ఖాజావలి

వివరాలు మెయిన్‌లో...




# సంకల్పంతో ప్రత్యేక గ్రీవెన్స్

-విజయవాడ, మనంబ్యూరో

పి.మీరాహుస్సేన్ ఖాన్

ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారమే ప్రత్యేక గ్రీవెన్స్ లక్ష్యం

ప్రజల వద్దకే పాలన చేరాలనే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నాం

స్వీకరించిన ప్రతి ఫిర్యాదు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రత్యేక గ్రీవెన్స్ వేదిక

జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ






## వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా చేయడమే శాస్త్రవేత్తల లక్ష్యం కావాలి

- ఆహారపరంగా దేశానికే ధైర్యాన్నిచ్చిన ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం
- రైతుల ఉత్పత్తులకు వాల్యూ ఎడిషన్ జోడించేందుకు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ

3 లో

## బాల్యం పుస్తకాలను పట్టాలి... పనిముట్లను కాదు




- బాల కార్మిక వ్యవస్థకు ముగింపు పలికితేనే భవిష్యత్తుకు బంగారు బాట
- బాల కార్మిక వ్యవస్థను అరికట్టడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత
- పిల్లల ప్రతిభతోనే దేశ అభివృద్ధి సాధ్యం
- బాల్యాన్ని కాపాడద్దాం బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం
- పిల్లలను పనిలో కాదు, పాఠశాలలో చూడాలని సంకల్పిద్దాం
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.

# అప్పులకు, అరాచకాలకు, అవినీతికి నిలియంగా ఆంధ్రప్రదేశ్

- అమలు చేయలేని వాగ్దానాలు చేయటం, అమలు చేయకపోవడంమే బాబు నైజం
- జగ్గయ్యపేట వైయస్సార్ కాంగ్రెస్ ఇన్ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు
- జగ్గయ్యపేటలో వెన్నుపోటుకు రెండేళ్లు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో కదం తొక్కిన వైయస్సార్సీపి శ్రేణులు

**జగ్గయ్యపేట జూన్ 12 మనం న్యూస్:** అమలు చేయలేనివాగ్దానాలు చేయటం , చేసిన వాగ్దానాలను అమలు చేయకపోవడం చంద్రబాబు నైజమని అమలు చేయలే ని వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనతో అప్పులకు అరాచకాలకు అవినీతికి నిలయంగా ఆంధ్రప్రదేశ్ మారింది అంటూ ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ప్రభుత్వ వైఖరికి నిరసనగా జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కోదాడ రోడ్ లోని వైయస్సార్ విగ్రహం, బస్టాండ్ సెంటర్, నెహ్రూ చౌక్, కన్యాకుమారి పాన్ షాప్, పొట్టి శ్రీరాములు విగ్రహం, సాయిబాబా గుడి, ఫైర్ స్టేషన్, తాసిల్దార్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు , జగ్గయ్యపేట నియోజకవర్గ పరిశీలికలు ఆళ్ల చల్లారావు , రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్న) మరియు వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు తో సహా నేతలు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్లు గడిచినా వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మహిళలు, యువత, రైతులు, నిరుద్యోగులు, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలను అబద్ధపు హామీలతో మోసం చేసి అధికారంలోకి వచ్చారని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. జగ్గయ్యపేటలో టి.టి.డి కళ్యాణ మండపం ప్రారంభమైతే సామాన్య ప్రజలకు తక్కువ ఖర్చుతో శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం లభిస్తుందని, అలాగే హైవే బస్టాండ్ వినియోగంలోకి వస్తే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుతాయని పేర్కొన్నారు. అయితే ఈ రెండు పనులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై స్థానిక శాసనసభ్యుడుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే టి.టి.డి కళ్యాణ మండపం, హైవే బస్టాండ్ను ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని, డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన మెగా డీఎస్సీ వాస్తవానికి నిరుద్యోగ యువతకు 'దగా డీఎస్సీ'గా మారింది మెగా డీఎస్సీ పేరుతో ప్రచారం చేసుకుంటూ యువతను మభ్యపెట్టడం సరికాదని, రాష్ట్రంలోని అన్ని ఖాళీలను గుర్తించి వెంటనే పూర్తి స్థాయి డీఎస్సీ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, యువత ఆవేదనకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రెండేళ్లుగా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. వైఎస్ఆర్ సీపీ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై వైఎస్ఆర్ సీపీ నిరంతరం పోరాడుతుందని, ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామాల నాయకులు , మహిళలు, కార్యకర్తలు, భారీ ఎత్తుగా పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు అభిమానుల ప్రదర్శనతో పేట విధులు జన సందోహంతో నిండిపోయాయి.





# వణుకుడు వ్యాధిపై అద్భుత విజయం




- పార్కిన్సన్ రోగులకు యశోద నవజీవనం
- హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద వైద్యశాలలో అత్యంత సంక్లిష్ట మెదడు శస్త్రచికిత్సలు విజయవంతం
- హుజూరాబాద్, కాజీపేటకు చెందిన బాధితులకు అధునాతన వైద్య విధానంతో పూర్తి స్వస్థత
- మందులు పనిచేయని క్లిష్ట దశలో ఉన్న రోగులకు ఈ ఆధునిక చికిత్సే అత్యుత్తమ పరిష్కారం
- జాతీయ, అంతర్జాతీయ వైద్య నియంత్రణ సంస్థల గుర్తింపు పొందిన ఏకైక సమర్థవంతమైన విధానం
- విజయవాడ వేదికగా పూర్తి వివరాలు వెల్లడించిన యశోద ఆసుపత్రి నరాల శస్త్రచికిత్స నిపుణుల బృందం

**గాంధీనగర్, జూన్ 12 మనం న్యూస్:** వణుకుడు వ్యాధిగా పిలిచే పార్కిన్సన్ మహమ్మారి బారిన పడి నరకయాతన అనుభవిస్తున్న బాధితులకు ఆధునిక వైద్యం అభయమిస్తోంది. నాడీ వ్యవస్థను క్రమంగా క్షీణింపజేసే ఈ క్లిష్టమైన వ్యాధికి 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్' (మెదడు లోతైన ఉద్దీపన) శస్త్రచికిత్స ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తోంది. హైదరాబాద్ లోని హైటెక్ సిటీ యశోద వైద్యశాల వేదికగా ఈ అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్య నిపుణుల బృందం దిగ్విజయంగా పూర్తి చేసింది. ఈ చికిత్సా విధానం, సాధించిన అద్భుత ఫలితాలకు సంబంధించిన పూర్తి వివరాలను శుక్రవారం విజయవాడ గాంధీనగర్ లోని ఒక ప్రముఖ హోటల్లో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో యశోద ఆసుపత్రి నరాల శస్త్రచికిత్స నిపుణులు, పార్కిన్సన్ వ్యాధి పరిశోధనా కేంద్రం క్లినికల్ డైరెక్టర్ రాజేష్ అలుగోలు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా బాధిస్తున్న నాడీ సంబంధిత క్షీణత వ్యాధుల్లో పార్కిన్సన్ ప్రధానమైనదని, మన దేశంలో ప్రతి లక్ష మంది జనాభాలో సుమారు నలభై రెండు నుంచి అరవై మంది వరకు ఈ వ్యాధి బారిన పడుతున్నారని వివరించారు. రక్తపోటు, మధుమేహం తరహాలోనే ఈ వణుకుడు వ్యాధి కూడా జీవితకాలం వెన్నంటే ఉంటుందని, పైగా ప్రతి సంవత్సరం దీని తీవ్రత అంతకంతకూ పెరుగుతూ రోగిని తీవ్ర నిస్సహాయ స్థితికి నెట్టివేస్తుందని స్పష్టం చేశారు. వ్యాధి నిర్ధారణ జరిగిన తొలి మూడు నాలుగు సంవత్సరాల పాటు సాధారణ మందులతో కొంతమేర ఉపశమనం లభించినప్పటికీ, ఆ తర్వాత మందుల ప్రభావం పూర్తిగా క్షీణించిపోతుందని రాజేష్ అలుగోలు తెలిపారు. సరిగ్గా ఇలాంటి విపత్కర దశలో రోగులకు అమెరికా ఆహార ఔషధ నియంత్రణ సంస్థ, అలాగే భారతీయ ఔషధ నియంత్రణ మండలి ఆమోదం పొందిన ఏకైక మరియు అత్యంత సమర్థవంతమైన చికిత్సా విధానమే డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ అని ఉద్ఘాటించారు. ఈ అధునాతన ప్రక్రియలో భాగంగా రోగి మెదడులోని నిర్దిష్టమైన భాగంలో సూక్ష్మమైన విద్యుత్ తీగలను అత్యంత ఖచ్చితత్వంతో అమర్చి, వాటిని ఛాతీ భాగంలో లోపలి వైపు అమర్చే ఒక చిన్న పరికరంతో అనుసంధానం చేస్తారు. గత ముప్పై దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ఎంతో విశేషమైన గుర్తింపు పొందిన ఈ విధానం ద్వారా రోగుల జీవన ప్రమాణాలు ఊహించని రీతిలో మెరుగుపడతాయని విశ్లేషించారు. ఈ ఆధునిక చికిత్స ద్వారానే గత మూడేళ్లుగా తీవ్రమైన పార్కిన్సన్ వ్యాధితో పోరాడుతున్న హుజూరాబాద్కు చెందిన అశోక్ రెడ్డి, అలాగే ఏడాది కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాజీపేటకు చెందిన సంగీతకు హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద వైద్యశాలలో నిపుణులైన వైద్య బృందం విజయవంతంగా శస్త్రచికిత్సను నిర్వహించి పునర్జన్మ ప్రసాదించారు. ప్రస్తుతం వీరిద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని వైద్యులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. సుమారు రెండు వేల పడకల భారీ సామర్థ్యంతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోని విధంగా హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద వైద్యశాల అరుదైన, సంక్లిష్టమైన వ్యాధులకు అత్యుత్తమ సూపర్ స్పెషాలిటీ సేవలను అందిస్తోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్యులకు సైతం చేరువ చేస్తూ, అత్యంత సరసమైన ఖర్చుతోనే మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆసుపత్రి వర్గాలు స్పష్టం చేశాయి. విజయవాడలో జరిగిన ఈ అత్యంత కీలకమైన పత్రికా సమావేశంలో యశోద ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు రూపమ్ బోర్గొహైన్, రుక్మిణి మృదుల, ప్రసాద్, అలాగే హైటెక్ సిటీ ఆసుపత్రి ఉప జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, మార్కెటింగ్ ప్రతినిధి ఆర్. శ్యామ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు నగరాన్ని సుందర నగరంగా మరియు 'పోస్టర్ ఫ్రీ సిటీ'గా తీర్చిదిద్దుటలో భాగంగా నగర కమిషనర్

**గుంటూరు నగరపాలక సంస్థ జూన్ 12 (మనం న్యూస్ ప్రతినిధి)** గుంటూరు నగరాన్ని సుందర నగరంగా మరియు 'పోస్టర్ ఫ్రీ సిటీ'గా తీర్చిదిద్దుటలో భాగంగా నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సిటీ ప్లానర్ రాంబాబు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్ నందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీ ప్లానర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు, సెంట్రల్ మీడియన్లు (రోడ్డు డివైడర్లు), విద్యుత్ స్తంభాలు మరియు ప్రధాన కూడళ్లలో అనుమతి లేకుండా అనధికారికంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన మున్సిపల్ నిబంధనలపై పార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. నగర సుందరీకరణలో భాగంగా ఎవరూ కూడా ఇలాంటి అనధికారిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దని, నగరాన్ని 'పోస్టర్ ఫ్రీ సిటీ'గా మార్చడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కావున నగర పాలక సంస్థ పరిధిలో ఎటువంటి బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయవద్దని, ఎవరైనా బ్యానర్లు మరియు పోస్టర్లు ఏర్పాటు చేసిన వెంటనే వాటిని నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగ సిబ్బందిచే తొలగించుటయే గాక అట్టి వారిపై చట్ట ప్రకారము క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డి.సి.పి సూరజ్ కుమార్, ఏసిపిలు, పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనుట జరిగినది.





# వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా చేయడమే శాస్త్రవేత్తల లక్ష్యం కావాలి

**ఆహారపరంగా దేశానికే ధైర్యాన్నిచ్చిన ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం**

**రైతుల ఉత్పత్తులకు వాల్యూ ఎడిషన్ జోడించేందుకు కృషి చేయాలి**

**జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ**

**గుంటూరు, జూన్ 12: (మనం న్యూస్ ప్రతినిధి)**: ఆధునిక సాంకేతికత ఆలంబనగా రైతుకు వ్యవసాయాన్ని లాభసాటిగా చేకూర్చే విషయమై శాస్త్రవేత్తలు విస్తృత పరిశోధనలు సాగించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ కోరారు.ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం 63 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్బంగా శుక్రవారం లాం లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. తొలుత వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను నాబార్డు మాజీ చైర్మన్ గోవిందరాజులు, ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ పి వి సత్యనారాయణ, రిజిస్ట్రార్ ఏ. మణి తోడుగా జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వేడుకలకు విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ 63 ఏళ్ల లెగసీ కలిగిన వ్యవసాయ విశ్వవిద్యాలయ వేడుకల్లో పాల్గొనడం సంతోషదాయకమని, అదేవిధంగా జాతీయ ప్రాముఖ్యత గల వ్యవసాయ విశ్వవిద్యాలయం జిల్లాలో ఉండడం గుంటూరు జిల్లాకే గర్వకారణమన్నారు. సాధారణ విద్యార్థికి అర్థం కాని ఎన్నో వినూత్న మైన కోర్సులు వ్యవసాయ విశ్వవిద్యాలయం లో ఉన్నాయని తెలిసిందన్నారు. విభిన్న రకాల వరి వంగడాలను అభివృద్ధి చేయడం ద్వారా దేశానికే ధైర్యాన్నిచ్చిన విశ్వవిద్యాలయమని కొనియాడారు. అదేవిధంగా ప్రస్తుతమున్న వ్యవసాయ పద్ధతులలో చిన్న చిన్న మార్పులతో రైతుల ఆదాయాన్ని ఏ విధంగా పెంచాలనే కోణంలో శాస్త్రవేత్తలు ఆలోచించాలన్నారు. రైతు తయారు చేసే ఉత్పత్తులకు వ్యాల్యూ ఎడిషన్ జోడించడం ద్వారా ఆదాయ వనరులు పెరిగే విధంగా ఆలోచన సాగాలన్నారు. అలాగే మన పూర్వీకుల్లో లక్షల మందిలో ఒకరికి సోకే క్యాన్సర్ వ్యాధి ప్రస్తుతం ఏ స్థాయిలో ప్రబలిందో అందరికీ తెలిసిందేనన్నారు. ఇందుకు ప్రధాన కారణం మనం తీసుకునే ఆహారమేనన్నారు. భోజనం మంచి ఔషధంగా ఏ విధంగా ఉపయోగపడుతుందనే కోణంలో ఆలోచించాలన్నారు. ప్రకృతిని కాపాడుతూ, హానికరమైన ఎరువులను ఉపయోగించకుండా రైతుకు సరైన తోడ్పాటు అందించాలన్నారు. ఈ సంవత్సరం ఎల్ నినో సంవత్సరంగా ప్రకటించినందున విపరీత ఉష్ణోగ్రతల కారణంగా రైతులు ఇబ్బంది పడకుండా శాస్త్రవేత్తలు చొరవ చూపాలన్నారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు జిల్లా యంత్రాంగం నుండి అందిస్తామన్నారు. ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ పి వి సత్యనారాయణ. మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఘన కీర్తిని కొనసాగించేందుకు, అలాగే రైతులకు ఉపయోగపడే విధంగా భవిష్యత్తు ప్రణాళికల గురించి వివరించారు.పంటల వైవిధ్యీకరణ, పంటల సాంద్రతను పెంచడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధిక సూక్ష్మ పోషకాలు ఉండే నూతన వంగడాల సృష్టికి కృషి చేస్తున్నామన్నారు.అలాగే రోజురోజుకీ తీవ్రమవుతున్న వ్యవసాయ కూలీల కొరతను తీర్చేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆలోచన చేస్తున్నామన్నారు.అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా అగ్రి టెక్ స్కిల్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఘన జీవామృతాల వృద్ధికి సైతం కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ సందర్భంగా నూతన వంగడాలను సృష్టించిన శాస్త్రవేత్త రాణి చోప్రా ను బంగారు పతకం మెమెంటో తో,ఎంవి రెడ్డి గారి పేరుతో ఏర్పాటుచేసిన పురస్కారాన్ని చిలకలూరిపేటకు చెందిన రైతు నాగభైరవ శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, విద్యార్థిని విద్యార్థులు, రైతు సోదరులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.




# ‘వెన్నుపోటు పాలన’పై వైకాపా నిరసన



**▸▸ సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలంటూ పశ్చిమలో ర్యాలీ**

**విజయవాడ, పశ్చిమ జూన్ 12 (మనం న్యూస్)**: కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఎన్నికల హామీల అమలులో వైఫల్యం చెందిందంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో శుక్రవారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. వెన్నుపోటుకు రెండేళ్లు అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ కోమల విలాస్, రమణయ్య కూలింగ్ షాప్, సామరంగ్ చౌక్ మీదుగా ఐరన్ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. మహిళలకు నెలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, వివిధ వర్గాలకు ప్రకటించిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, యువత, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విధానాలతో అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఉదయం నుంచే ప్రజలు స్వచ్ఛందంగా నిరసన కార్యక్రమానికి తరలివచ్చారని, ఇది ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా అమలు చేసే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రుహుల్లా, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పుణ్యశీల, రేపాల శ్రీనివాసరావు, కుప్పం ప్రసాద్, గుబ్బా చంద్రశేఖర్, కర్నాటి రాంబాబు, మండేపూడి చటర్జీ, మనోజ్ కొఠారి, బంక విజయ, గురుమాహంతు మహేష్, తుపాకుల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.




# మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జి వేమారెడ్డి ‘మహా గర్జన



**▸▸ దద్దరిల్లిన మంగళగిరి**

**మంగళగిరి గడ్డ పై వేమారెడ్డి అధ్వర్యంలో ఎగరబోతున్న వై.సి.పి జెండా**

**▸▸ వెన్నుపోటుకు 2 ఏళ్లు’ ర్యాలీ విజయవంతం**

**మంగళగిరి, జూన్ 12, మనం న్యూస్**: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల హామీలు ఒక్కటీ అమలు చేయలేదని, ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల కష్టాలు, అవినీతితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆరోపిస్తూ మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి. వైఎస్సార్సీపీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి నాయకత్వంలో ’వెన్నుపోటుకు రెండేళ్లు’ పేరుతో ఈ మహా గర్జన కార్యక్రమం జరిగింది. మంగళగిరి వైసీపీ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ మిద్దె సెంటర్ మీదుగా గాలి గోపురం వరకు బైక్ ర్యాలీగా, అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్రగా సాగింది. 42 గ్రామాలు, తాడేపల్లి-మంగళగిరి 55 వార్డుల నుంచి కార్యకర్తలు, వాలంటీర్లు, మహిళలు, యువత భారీగా తరలివచ్చారు. ఇది సాధారణ నిరసన కాదు, ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి వైసీపీ ఇచ్చిన గట్టి హెచ్చరిక అని ఇన్చార్జి వేమారెడ్డి పేర్కొన్నారు. సమన్వయకర్త దొంతి రెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ, ఇంతమంది ప్రజలు రావడమే ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. గతంలో అందిన సంక్షేమ పథకాలు కట్ చేసి, 66 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులను 60 లక్షలకు కుదించి 6.20 లక్షల మందిని తొలగించారని విమర్శించారు. స్కూల్ కిట్లు, డీఎస్సీ, ఫీజు రియంబర్స్మెంట్లో అన్యాయం జరిగిందని, ప్రశ్నించిన వారిపై పోలీస్ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రతి ఎన్నికల్లో వెన్నుపోటు పొడుస్తున్నారని, మిగిలిన రెండేళ్లు భరించి వామపక్షాలతో కలిసి ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ నిరుద్యోగులకు 3 వేలు, 50 ఏళ్లకే పెన్షన్, మహిళలకు 15 వేలు, విద్యార్థులకు 15 వేలు ఇస్తామన్న హామీలు అమలు కాలేదన్నారు. రాజధాని పేరుతో రైతులకు ప్లాట్లు ఇవ్వకుండా అప్పుల భారం ప్రజలపై మోపారని, రాష్ట్ర పరిపాలన అస్తవ్యస్తంగా ఉందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని వైసీపీ తరపున డిమాండ్ చేశారు.పరిశీలకులు యార్లగడ్డ మదనమోహన్ కూడా ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు. రాజధాని పేరుతో తెచ్చిన అప్పుల భారం పేద, మధ్యతరగతి ప్రజలపై పడిందని, ప్రజా వ్యతిరేక విధానాలపై అంబేద్కర్ విగ్రహం సాక్షిగా గళం విప్పామని తెలిపారు. ఈ మహా గర్జనతో మంగళగిరి నియోజకవర్గం నుంచి ప్రభుత్వానికి బలమైన సంకేతం పంపినట్లయిందని వైసీపీ నేతలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, నియోజకవర్గ పరిశీలకులు యార్లగడ్డ మదనమోహన్, మంగళగిరి టౌన్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, తాడేపల్లి టౌన్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమర నాగయ్య, మంగళగిరి రూరల్ అధ్యక్షులు నాలి వెంకట కృష్ణ, దుగ్గిరాల మండల అధ్యక్షులు తాడిబోయిన శివగోపయ్య మరియు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు మహిళా నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.








# ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారమే ప్రత్యేక గ్రీవెన్స్ లక్ష్యం

**ప్రజల వద్దకే పాలన చేరాలనే సంకల్పంతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నాం**

**స్వీకరించిన ప్రతి ఫిర్యాదు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం**

**ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రత్యేక గ్రీవెన్స్ వేదిక**

**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

**(విజయవాడ,మనం న్యూస్ బ్యూరో):** ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారం అందిచేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు సమస్యల పరిష్కారంలో అధికారులు పారదర్శకత జవాబుదారీతనం పాటించి ప్రజలకు న్యాయం చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపేందుకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తిరువూరు నియోజకవర్గంలోని విసన్నపేట డా. బిఆర్ అంబేద్కర్ గురుకులంలో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, స్థానిక శాసనసభ్యులు కె. శ్రీనివాసరావు ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి స్వకరించిన ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఒక సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సేవలు అందేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.






ప్రజల వినతులను సానుకూల దృక్పథంతో పరిశీలించి పరిష్కరించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, శాశ్వత పరిష్కార మార్గాలు చూపేందుకు కార్యక్రమం దోహపడుతుందన్నారు. ప్రతి వినతి వెనుక ఒక కుటుంబం అవసరం, ఒక వ్యక్తి ఆశ ఉందనే భావనతో అధికారులు స్పందించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల సంతృప్తే ప్రభుత్వ పనితీరుకు నిజమైన కొలమానమని అధికారులు గుర్తించాలన్నారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం లేకుండా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. తిరువూరు నియోజకవర్గం పరిధిలోని తిరువూరు ఎ కొండూరు రెడ్డిగూడెం, విస్సన్న పేట మండలాలకు సంబంధించి ప్రజల నుండి మొత్తం 173 ఆర్జీలను స్వీకరించడం జరిగింది. వీటిలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం 94, రెవెన్యూ శాఖ 26, ఏపీ సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సంఘం (అ్ఖిగిఖఊఐఖి) 14, పంచాయతీ రాజ్ శాఖ 10, ఏపీసీపీడీసీఎల్ (విద్యుత్ శాఖ) 6, గృహ నిర్మాణ శాఖ 5, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ 3, సర్వే సెటిల్మెంట్ మరియు భూ రికార్డుల శాఖ 3, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ 3, పోలీసు శాఖ2, రోడ్లు మరియు భవనాల శాఖ (ఖఆ) 2, సాంకేతిక విద్యా శాఖ 2 ఏపీ దివ్యాంగులు మరియు వృద్ధుల సహాయ సంస్థ , మద్యనిషేధం మరియు ఎక్సైజ్ శాఖ , పాఠశాల విద్యా శాఖ లకు సంబంధించి ఒక్కొక్క ఆర్జీ స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఆర్డీవో ఎ. కుమార్, పిడిఆర్డీఏ శ్రీనివాసరావు, డిపివో పి. లావణ్య కుమారి, డిఈవో ఎల్. చంద్రకళ, అగ్రికల్చర్ డిఎంఎఫ్ విజయకుమారి, జిల్లా అటవీ అధికారి జి. సతీష్, డ్వామా ఏపీడి పార్థసారధి తిరువూరు, ఎ కొండూరు, రెడ్డిగూడెం, విసన్నపేట, మండల తహాశీల్దార్లు వివిధ శాఖకు చెందిన జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.









# బాల్యం పుస్తకాలను పట్టాలి పనిముట్లను కాదు

**బాల కార్మిక వ్యవస్థకు ముగింపు పలికితేనే భవిష్యత్తుకు బంగారు బాట**

**బాల కార్మిక వ్యవస్థను అరికట్టడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత**

**పిల్లల ప్రతిభతోనే దేశ అభివృద్ధి సాధ్యం**

**బాల్యాన్ని కాపాడద్దాం బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం**

**పిల్లలను పనిలో కాదు, పాఠశాలలో చూడాలని సంకల్పిద్దాం**

**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

**విజయవాడ,జూన్,11,(మనం ప్రతినిధి):** బాల్యం అనేది ప్రతి చిన్నారి జీవితంలో అత్యంత విలువైన దశ అని బాల్యంలో విద్య ఆనందం ఆటపాటలతో గడపాల్సిన చిన్నారులు బాల కార్మిక వ్యవస్థ కారణంగా వారి హక్కులను కోల్పోతున్నారని పుస్తకాలను పట్టాల్సిన సమయంలో పనిముట్లను పట్టుకుని పనిచేయడం ద్వారా భవిష్యత్ చిన్నభిన్నం అవుతుందని బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి చిన్నారి బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్మిక శాఖ, మహిళ శిశు సంక్షేమ శాఖ, ఫోరం ఫర్ చైల్ రైట్స్, వాసవ్య మహిళామండలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం భవానిపురంలోని పున్నమిఘాట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ విడుదల చేసి అనంతరం ర్యాలీని ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యంలో చిన్నారులు పుస్తకాలను పట్టాలి కాని పనిముట్లను కాదనే విషయాన్ని ప్రతి కుటుంబం గుర్తుంచుకోవాలన్నారు. చిన్న వయస్సులోనే పనుల్లో నిమగ్నమై తమ బాల్యాన్ని కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. చిన్నారులు పనుల్లో కాకుండా పాఠశాలల్లో ఉండి విద్యాభ్యాసం చేయాలని, ఆరోగ్యంగా ఎదగాలని, యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. చదువు ద్వారా పిల్లలలో ఉన్న ప్రతిభను వెలికితీయగలిగితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బాల కార్మిక వ్యవస్థకు ముగింపు పలికితేనే భవిష్యత్తుకు బంగారు బాట ఏర్పడుతుందన్నారు. బాల కార్మిక వ్యవస్థను అరికట్టడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత గుర్తించాలన్నారు. బాల్యాన్ని కాపాడుతూ, ప్రతి చిన్నారికి విద్య హక్కును అందించగలిగిదే ఉత్తమ సామాజానికి బాటలు వేసిన వారమవుతామన్నారు. పిల్లలను పనిలో కాకుండా పాఠశాలలో చూడాలని సంకల్పంతో ముందుకు సాగాలని బాల్యాన్ని కాపాడి బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి, పాఠశాలకు వెళ్లకుండా పనులు చేస్తున్న చిన్నారులను గుర్తించి సమీపంలోని పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి బాలుడు, బాలిక విద్యను అభ్యసిస్తూ ఆరోగ్యంగా ఎదిగితేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.భవిష్యత్ తరాలను సుస్థిరంగా తీర్చిదిద్దాలంటే పిల్లల హక్కులను పరిరక్షించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి చిన్నారి తన బాల్యాన్ని ఆనందంగా గడిపేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజంపైనా ఉందన్నారు. బాల కార్మికులను గుర్తించినట్లయితే వెంటనే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించి చిన్నారులను విద్యా మార్గంలో నడిపించేందుకు సహకరించి జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ప్రతి చిన్నారి సురక్షితమైన, విద్యావంతమైన భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూడి కమిషనర్ జి. ధనలక్ష్మీ, ఐసిడిఎస్ పిడి రుక్సానా సుల్తానా బేగం, ఫోరం ఫర్ చైల్ జిల్లా కో-ఆర్డినేటర్ ఆరవ రమేష్, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఎం మధు తదితరులు పాల్గొన్నారు.



# లీ ఫార్మా లిమిటెడ్, లీ హెల్త్ డొమైన్ అద్వర్యంలో మూవ్-నరిష్-బ్రీత్






▶▶ ఎముకలు,కీళ్ల పరీక్షలకు ఉచిత మోగా వైద్య శిబిరం

▶▶ శరీరం ఆరోగ్యానికి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి

▶▶ లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి

విశాఖపట్నం,జూన్, 12,(మనం న్యూస్)ః అధ్యాపకులు వ్యవస్థకి మూల స్తంభాలవంటి వారని,నిత్యం విద్య బోధనకే జీవితాన్ని అంకితం చేస్తూ,గంటల కొద్ది నిలబడే పాఠాలు చెబుతుంటారని ఇటు వండి వారు తప్పకుండా మంచి ఆహారాన్ని తీసుకోవాలని,త ద్వారానే ఎముకలు, కీళ్ళు గట్టిపడి ,మెరుగుగా ఉంటాయని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి పేర్కొన్నారు. లీ ఫార్మా లిమిటెడ్ మరియు లీ హెల్త్ డొమైన్ సంయుక్తంగా గ్రీన్ సిటీ స్కూల్ సహకారంతో ఉపాధ్యాయుల కోసం 'మూవ్-నరిష్-బ్రీత్' (కదలండి-పోషణనొందండి-శ్వాసించండి) అనే ప్రత్యేక కార్యక్రమం కింద ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్యం, ఆహార మార్పులు మరియు యోగా సెష్న ఒక అవగాహన సదస్సును నిర్వహించాయి.ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య పరీక్షలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ ఆరోగ్య అవగాహన సదస్సులో లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలా రాణి మాట్లాడుతూ ప్రతి మనిషి ఆరోగ్యవంతమైన జీవన శైలిని అలవర్చుకోవాలని ,నాణ్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు, కార్యక్రమం లో క్యాంప్ కోఆర్డినేటర్లు జయలక్ష్మి , సరోజిని , డాక్టర్ రాధిక , న్యూట్రిషనిస్టులు (పోషకాహార నిపుణులు) మాధురి మరియు క్రాంతి, జి.ఎన్.ఎమ్ (ప్రో) భాగ్యలత మరియు పవని, లీ ఫార్మా బృందం, అలాగే గ్రీన్ సిటీ స్కూల్ ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# కూటమి పాలన రెండేళ్లు పేదలతో వేడుకలు



▶▶ కేక్ కట్ చేసి కూరగాయలు పంపిణీ చేసిన బొండా రవితేజ

విజయవాడ సెంట్రల్ జూన్ 12 (మనం న్యూస్)ః కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 25వ డివిజన్లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కుర్మయ్య వంతెన సెంటర్లోని అమ్మవారి ఆలయం వద్ద జరిగిన వేడుకల్లో తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బొండా రవితేజ ముఖ్య అతిథిగా పాల్గొని పేద ప్రజలు, సానిటరీ కార్మికులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం వారికి కూరగాయలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బొండా రవితేజ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా . చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం అనే ద్వంద్వ లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ రైతులు, మహిళలు, యువత, కార్మికులు, పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నాడు సమస్యలు - నేడు పరిష్కారాలు కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరిస్తున్నారని చెప్పారు.రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి, విద్యా, వైద్య రంగాల మెరుగుదల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని వివరించారు. పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు ప్రోత్సాహం, అనారోగ్య బాధితులకు వైద్య సహకారం వంటి సేవా కార్యక్రమాల ద్వారా వేలాది కుటుంబాలకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమం అనంతరం పేదలకు కూరగాయలు పంపిణీ చేసి, నగర పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న సానిటరీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు మాచర్ల పావని, డివిజన్ అధ్యక్షుడు మాచర్ల గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి ఇనుకుల సాయిబాబు, దొంగర ఆంజనేయులు, ప్రవీణ్ జైన్, బోనేని శ్రీనివాస్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు.. నూజివీడులో వైఎస్సార్సీపీ శక్తి ప్రదర్శన



▶▶ జనసంద్రంగా మారిన పట్టణం.. భారీ ర్యాలీతో కూటమి ప్రభుత్వంపై విమర్శల వెల్లువ

నూజివీడు, జూన్ 12 ( ఆంధ్ర మనం)ః మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో నూజివీడులో నిర్వహించిన 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమం భారీ విజయవంతమైంది. నియోజకవర్గం నలుమూలల నుంచి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో నూజివీడు పట్టణం జనసంద్రంగా మారింది. ప్రధాన కూడళ్లు, రహదారులు జన సందోహంతో కిక్కిరిసిపోగా, అడుగడుగునా ట్రాఫిక్ నిలిచిపోయింది. కార్యకర్తల నినాదాలు, వేలాది బైక్ల హోరుతో పట్టణం దద్దరిల్లింది.ద్వారకా ఎస్టేట్ వద్ద ప్రారంభమైన భారీ ర్యాలీ చిన్న గాంధీ బొమ్మ, పొట్టి శ్రీరాములు సెంటర్, పెద్ద గాంధీ బొమ్మ, శ్రీనివాస సెంటర్ మీదుగా సబ్-కలెక్టర్ కార్యాలయం వరకు ఉత్సాహభరితంగా సాగింది. ర్యాలీ పొడవునా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్సీపీ శ్రేణులు నినాదాలు చేశాయి. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశాయి.నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన కార్యకర్తలతో పట్టణ రహదారులు కిక్కిరిసిపోయాయి. లెక్కలేనన్ని బైక్లతో యువకులు ర్యాలీలో పాల్గొనగా, మహిళలు, పార్టీ అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో నూజివీడు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకులు మాట్లాడుతూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అన్ని వర్గాలను నిరాశపరిచిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. ప్రజల సమస్యలపై స్పందించకుండా ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని ఆరోపించారు. నూజివీడు నియోజకవర్గంలో వైఎస్సార్సీపీకి ఉన్న బలాన్ని, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు ఉన్న ప్రజాదరణను ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. కార్యకర్తలు, అభిమానుల ఉత్సాహం చూస్తే రానున్న రోజుల్లో వైఎస్సార్సీపీ మరింత బలంగా ప్రజల్లోకి వెళ్తుందనే విషయం స్పష్టమవుతోందన్నారు .కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. నూజివీడు పట్టణమంతా వైఎస్సార్సీపీ జెండాలు, నినాదాలతో మార్మోగింది. 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమం జిల్లాలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# చంద్రబాబుకు మరింత శక్తినివ్వాలని దుర్గమ్మను వేడుకబుద్ధ వెంకన్న



విజయవాడ పశ్చిమ జూన్ 12 ( మనం న్యూస్)ః ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న నేతృత్వంలో వన్టౌన్ చైనా వాల్ నుంచి ఇంద్రకీలాద్రిపైని దుర్గగుడి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఘాట్ రోడ్డులోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రాభివృద్ధి, సీఎం చంద్రబాబు నాయుడు ఆరోగ్యం, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో కూటమికి 164 అసెంబ్లీ స్థానాలు లభించాయని, అభివృద్ధికి అనుకూలంగా ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. గత వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అరాచకాలను ప్రజలు గమనించారని, అందుకే ఆ పార్టీని ఘోరంగా ఓడించారని విమర్శించారు. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి మనుగడ ఉండదని, చంద్రబాబు నాయకత్వంలోనే ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అమరావతి, విజయవాడలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఖండించిన ఆయన.. ప్రకృతి విపత్తులను ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు. ఇటీవల భారీ వర్షాలతో హైదరాబాద్లోనూ పలు ప్రాంతాలు జలమయమైన విషయాన్ని గుర్తు చేస్తూ, అమరావతిపై మాత్రం ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధికి అడ్డుపడటమే వైసీపీ లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. 76 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు నాయుడు రోజుకు 20 గంటలకు పైగా పనిచేస్తూ రాష్ట్రాభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని బుద్దా వెంకన్న కొనియాడారు. భారత రాజకీయాల్లో ఆయన ఓ సూపర్ స్టార్లాంటి నాయకుడని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన 11 సీట్లతో వైసీపీ అసెంబ్లీలోకి వెళ్లి ప్రజా సమస్యలపై మాట్లాడాలని సూచించారు.చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే శక్తిని ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు బుద్దా వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం

**జగ్గయ్యపేట జూన్ 12 మనం న్యూస్ః** జగ్గయ్యపేట మండలంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల గండ్రాయి మెయిన్ నందు శుక్రవారం పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు అందరూ కల్సి పిల్లలకు గులాబీలు ఇచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు. పాఠశాలపునః ప్రారంభం సందర్భంగా పాఠశాల కు వస్తున్న విద్యార్థిని విద్యార్థులకు స్కూలు బయట నుండి స్వాగతం పలికి తరగతి గది లోకి తీసుకొచ్చి కూర్చోబెట్టటం జరిగింది. అనంతరం సరస్వతి దేవి పూజ చేసి పిల్లలకు చాక్లెట్లు అందించారు.ఈ కార్యక్రమంలో



ప్రదానోపాద్యాయులు నేలవల్లిరమేష్ బాబు, ఉపాధ్యాయులు సుబ్బారావు, విజయలక్ష్మి, దేవదానం, పద్మావతమ్మ ,ముక్తేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ హోమ్ ఎకోసిస్టమ్ పరిణామ క్రమాన్ని ప్రదర్శించిన ఎల్జీ ఎలక్ట్రానిక్స్

**విజయవాడ,జూన్ , 12,మనం న్యూస్)ః** ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఏఐ హోమ్ వ్యవస్థకు సంబంధించి తన దృష్టికోణాన్ని వెల్లడించింది. రోజువారీ గృహకార్యాల భారం తగ్గించి, జీవితాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చే తెలివైన సాంకేతికతలతో కూడిన 'జీరో లేబర్ హోమ్' దిశగా రూపొందించిన రోడ్మ్యాప్ను ఈ సందర్భంగా పరిచయం చేసింది.ఈ దృష్టికోణానికి మూలాధారం ఎల్జీ నమ్మకమే. భవిష్యత్ గృహం కేవలం పరికరాలను అనుసంధానించడానికే పరిమితం కాకుండా, వినియోగదారులను అర్థం చేసుకుని, వారి అవసరాలను ముందుగానే గుర్తించి, వారి తరపున చర్యలు తీసుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండాలని ఎల్ జీ భావిస్తోంది. ఈ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు ఎల్ జీ మూడు కీలక అంశాలతో కూడిన ఏఐ హోమ్ ఎకోసిస్టమ్ను అభివృద్ధి చేస్తోంది. ఇందులో ఏఐ ఆధారిత గృహోపకరణాలు, థింక్ క్యూ ఆర్కెస్ట్రేషన్, స్వయంచాలక హోమ్ రోబోలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. దశాబ్దాలుగా సాధించిన హార్డ్వేర్ ఆవిష్కరణల పునాదిపై, ఎల్ జీ 'అఫెక్షనేట్ ఇంటెలిజెన్స్' సాంకేతికతతో రూపొందించిన ఈ ఎకోసిస్టమ్ కుటుంబాల రోజువారీ వినియోగ విధానాలను అర్థం చేసుకుని, వివిధ పరికరాల మధ్య సమన్వయాన్ని కల్పిస్తూ, రోజువారీ జీవితాన్ని మరింత సులభతరం చేసేలా రూపొందించబడింది.

## జిల్లా కలెక్టర్ లక్ష్మీ షాను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ కమిషనర్ ప్రసాద్

**జగ్గయ్యపేట జూన్ 12 మనం న్యూస్ ః** జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ గా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన పి వి వి డి ప్రసాదరావు జిల్లా కలెక్టర్ లక్ష్మీషా ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం విజయవాడ లోని కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ను జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు . ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు.



## యోగ వ్యాయామం కాదు.. సంపూర్ణ జీవన విధానం

- **శరీరానికి బలం, మనసుకు ప్రశాంతత, జీవితానికి సమతుల్యత యోగతోనే సాధ్యం...**
- **శ్వాసను నియంత్రించే యోగ జీవితం క్రమశిక్షణతో నడిపించే శక్తిని ఇస్తుంది...**
- **యోగం ద్వారా ఒత్తిడి తగ్గి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది..**
- **ప్రజా ఉద్యమంగా యోగాంధ్ర ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలి...**
- **జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.**

**విజయవాడ,జూన్,12,(మనం ప్రతినిధి)ః** శరీరానికి బలం, మనసుకు ప్రశాంతత, జీవితానికి సమతుల్యత యోగతోనే సాధ్యమవుతుందని యోగ కేవలం వ్యాయామం కాదని సంపూర్ణ జీవన విధాననికి మార్గమని శ్వాసను నియంత్రించి జీవితాన్ని క్రమశిక్షణతో నడిపించే శక్తి యోగ ద్వారానే వస్తుందని ఒత్తిడిని తగ్గించి ఆత్మావిస్వశాన్ని పెంచే యోగాను ప్రతి ఒక్కరూ దిన చర్యలతో ఒక భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భవానిపురంలోని బెరం పార్కు నందు నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్ని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని అది సంపూర్ణ జీవన విధానమని అన్నారు. శ్వాసను నియంత్రించే యోగ మనిషికి శారీరక మానసిక ఆరోగ్యాన్ని అందించడమే కాకుండా జీవితాన్ని క్రమశిక్షణతో నడిపించే శక్తిని ఇస్తుందని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో యోగ ఎంతో అవసరమని చెప్పారు. యోగ సాధన ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయం యోగకు కేటాయించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. ప్రతిరోజూ కేవలం 45 నిమిషాల సమయాన్ని కేటాయించి కామన్ యోగా ప్రోటోకాల్ను అనుసరిస్తే, ఆరోగ్య పరంగా అత్యున్నత స్థాయి యోగా సాధన ద్వారా లభించే ప్రయోజనాల్లో దాదాపు 60 నుంచి 70 శాతం ప్రయోజనాలు పొందవచ్చని కలెక్టర్ వివరించారు. జిల్లాలో





ప్రజా ఉద్యమంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాభ్యాసంలో భాగస్వాములు కావాలని ఆరోగ్యవంతమైన, ఆనందమమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని అన్నారు. ఆరోగ్యవంతమైన పౌరులే రాష్ట్ర, దేశ అభివృద్ధికి బలమైన పునాది అని భావించి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా నోడల్ ఆఫీసర్ డా. ప్రియదర్శిని, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ షమ్మి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ పి. శ్రీనివాసరావు, సెంట్ ఆన్స్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సనాతన విలువల పరిరక్షణకు కృషి చేయాలి

- **అన్ని వర్గాలు సామరస్యంతో ముందుకు సాగాలి**
- **సయ్యద్ బాషా**

**విజయవాడ తూర్పు జూన్ 12( మనం న్యూస్):** భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, సనాతన విలువలను పరిరక్షించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా అన్నారు. వైవిధ్యంలో ఏకత్వానికి భారతదేశం ప్రతీకగా నిలిచిందని, అన్ని మతాలు, వర్గాలు పరస్పర గౌరవం, సోదరభావంతో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ఆధ్యాత్మిక గురువు, సామాజిక సేవకుడు అల్తాఫ్ బాబా శుక్రవారం సందర్శించి పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా సుఫీ కాన్ఫరెన్స్ నిర్వహణకు సంబంధించిన అంశాలపై బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్జీతో చర్చించారు.అనంతరం అల్తాఫ్ బాబాకు ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ వైభవానికి ప్రతీకగా నిలిచే కొండపల్లి కళాఖండాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో



బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ బాషా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా సామాజిక సామరస్యం, సర్వమత సమభావం మరింత బలోపేతం అవుతున్నాయని అన్నారు. ఆధ్యాత్మిక నాయకులు సమాజంలో శాంతి, సామరస్యం, నైతిక విలువల పెంపుకు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల యువతలో అవగాహన పెంపొందించడం అవసరమని, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, మైనారిటీ మోర్చా ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ల

# వాస్తవాలు మాట్లాడతాయి అబద్ధాలు కాలగర్భంలో కలిసిపోతాయి

**▸▸ మొండితోక సోదరుల అబద్ధాల రాజకీయాలపై నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తీవ్ర ఖండన.**

నందిగామ, జూన్12(మనం న్యూస్)ః నేడు వైసీపీ నేతలు మాట్లాడిన ఆరోపణలు చూస్తుంటే ఒక నిజం అర్థమవుతుంది - అధికారం పోయిన బాధకంటే, అబద్ధం పట్టుబడిన సిగ్గు వారిని ఎక్కువగా వేధిస్తోంది.ఈ ఆరోపణలు ఈరోజు పుట్టినవి కాదు - ఐదేళ్లుగా వైసిపి పాలనలో చెబుతున్న అదే అబద్ధాలు, అదే అవాస్తవాలు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడ అనేకసార్లు జీవో కాపీలతో సమాధానం ఇచ్చాం, ఆధారాలు చూపించాం. అయినా మళ్ళీ నిస్సిగ్గుగా అవే మాటలు - ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమవుతుందన్న పాతకాలం నాటి భ్రమను వారు ఇంకా వదులుకోలేదని అర్థమవుతుంది. సోషల్ మీడియా యుగంలో ఇలాంటి చౌకబారు ప్రయత్నాలు వృధా ప్రయాస మాత్రమే. కానీ నందిగామ ప్రజల జ్ఞాపకశక్తి అంత బలహీనమైనది కాదు. అందుకే ఐదేళ్ల వైసిపి అరాచక పాలనలో ప్రతి అడుగును గుర్తుపెట్టుకుని, చరిత్రలో ఎన్నడూ లేని అసాధారణ మెజారిటీతో వారికి తీర్పు చెప్పారు. ఆ గుణపాఠం ఇప్పటికీ అర్థం కాకపోవడం దురదృష్టకరం. అంతేకాదు - వైసీపీ 'వెన్నుపోటు' కార్యక్రమంలో జరిగిన దున్నపోతు ఘటన చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన సమావేశం చివరకు రాజకీయ నాటకానికి ప్రతీకగా మారింది. వైసీపీ 'వెన్నుపోటు'కార్యక్రమానికి 'దున్నపోటు' బహుమతిగా లభించిందని ప్రజలు పరిహాసంగా మాట్లాడుకుంటున్నారు.

## క్రెడిట్ దొంగతనం – 100 పడకల ఆసుపత్రి, కేంద్రీయ విద్యాలయం, శివాలయం

వంద పడకల ఆసుపత్రి, కేంద్రీయ విద్యాలయం, శివాలయం అభివృద్ధి అంటూ ఐదేళ్లు కాగితాలు పట్టుకుని పత్రికా సమావేశాలు నిర్వహించారు. కానీ ఆ ఐదేళ్లలో ఒక్క సెంటు స్థలం కొనుగోలు చేయలేదు,ఒక్క ఇటుక పెట్టలేదు,ఒక్క రూపాయి నిధులు విడుదల చేయలేదు. పదేపదే ఛాలెంజ్ చేశాం - 'మీరు చేశారని ఒక్క ఆధారం చూపించండి' అన్నాం. నేటికీ జవాబు లేదు. అయినా నాలుగు రోజులు గడిస్తే 'మేమే తెచ్చాం' అని మళ్ళీ అదే అబద్ధం.నేడు ఆ మూడు పనులూ కేవలం జీవో కాపీల దగ్గర ఆగిపోలేదు ప్రభుత్వ అనుమతులతో, నిధుల విడుదలతో, శరవేగంతో నిర్మాణ పనులు ప్రజల కళ్ళ ముందు నడుస్తున్నాయి. 'పరిపాలించిన ఐదేళ్ల కాలమంతా ఫైళ్లు, కాగితాలు చూపించి కాలక్షేపం చేయడం మీ నైజం - పనులు పూర్తి చేసి ప్రజలకు అందించడం మా నైజం!'

## 'డమ్మీ ఎమ్మెల్యే' అనే అర్థంలేని ఆరోపణ

ఐదేళ్లు ఇద్దరు అన్నదమ్ముల గుప్పెట్లో సర్పంచులను, కౌన్సిలర్లను, చైర్పర్సన్లను నిర్వీర్యం చేసి - అందరి హక్కులు, నిధులు, నిర్ణయాలు తమ చేతుల్లో కేంద్రీకరించుకుని, ప్రజా ప్రతినిధులు అందరినీ డమ్మీలుగా మార్చి, నియంతృత్వంగా పరిపాలించిన వారు నేడు 'డమ్మీ ఎమ్మెల్యే' అని విమర్శ లేవనెత్తడం అత్యంత హాస్యాస్పదం.నేను 'డమ్మీ' అయితే - ఐదేళ్లు ప్రతిపక్షంలో ఒంటరిగా నిలబడి, అణచివేతలకు తలవంచకుండా, అర్ధరాత్రులు కొండలు గుట్టలపై ప్రజల మధ్య తిరిగి పోరాడిన నాయకురాలిని ఎలా అవుతాను?

మీ ఇద్దరు అన్నదమ్ముల నిరంకుశ రాజకీయాలను, దోపిడీలను ఒంటరిగా సవాలు చేసి, మీ అహంకారానికి వెన్నులో వణుకు పుట్టించి, చరిత్రలో ఎన్నడూ లేని ఘన విజయాన్ని సాధించిన శక్తి స్వరూపిణి ఈ తంగిరాల సౌమ్య.

## డమ్మీ పాలన కాదిది – దమ్మున్న పాలన అని ప్రతి అడుగులోనూ నిరూపితమవుతోంది.

ఆనాటి నందిగామ నగర పంచాయతీ చైర్పర్సన్ గారు బహిరంగంగా వ్యక్తం చేసిన ఆవేదన, అవమానాలు, వేదనలు... ఆవిడ అమరురాలు అయి నప్పటికీ.. ప్రజల జ్ఞాపకాలలో ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. మీ పాలనలో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ప్రతి ఒక్కరి హక్కులు, నిధులు మీ పాదాల కింద తొక్కిపట్టినప్పుడు వారు కార్చిన కన్నీళ్లు ఇంకా ప్రజల మనసుల్లో చెరిగిపోలేదు.మున్సిపల్ కౌన్సిలర్లందరూ కట్టకట్టుకుని ఊరు వదిలిపోయిన సంఘటన మీడియా సాక్షిగా ఇంకా సజీవంగా మిగిలి ఉంది.ఈ సంఘటనలే మీరు ప్రజాప్రతినిధులందరినీ డమ్మీలుగా మార్చారన్నదానికి సజీవ ఉదాహరణలు.నేడు మా పాలనలో సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రతి ప్రజాప్రతినిధి తమ హక్కులతో స్వేచ్ఛగా పనిచేస్తున్నారు - వారి విధులలో, నిధులలో ఎవరి జోక్యం ఉండదు. అవసరమైతే ముఖ్యమంత్రిని నేరుగా కలిసి సమస్యలుపరిష్కరించుకుంటున్నారు. మీ పాలనలో ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా ముఖ్యమంత్రిని కలవలేని దుస్థితి రాష్ట్రం చూసింది. ఆనాటి నియంతృత్వం గుర్తుండగానే ఈనాటి ప్రజాస్వామ్యం జీర్ణం కాక ఈ అర్థంలేని ఆరోపణ చేస్తున్నారు. 'సొంత పార్టీ నాయకులనే వంచించి ఏకాకులను చేసిన నియంతలు మీరు - ప్రజాప్రతినిధులందరికీ స్వేచ్ఛనిచ్చి విరాజిల్లుతున్న ప్రజాస్వామ్యం మాది!'

## నందిగామ అభివృద్ధి – మాటలు వద్దు, ఆచరణలో చూడండి

వైసీపీ ఐదేళ్ల 'అభివృద్ధి' అంటే సీఎస్ఆర్ నిధులు తెచ్చి దోచుకోవడం, ఉన్న రోడ్లను గుంతలు తొవ్వి వదలడం, రోడ్డు పక్కన చెట్లు నరికి అమ్ముకోవడం, జగనన్న కాలనీల పేరుతో సెంటు భూమికి కోట్లు లెక్కపెట్టి ప్రజల జేబులు కొట్టడం, శిలాఫలకాలు పెట్టి ఫోటోలు దిగడం. ఇదే ప్రజల మనసుల్లో మిగిలిన మీ అభివృద్ధి చరిత్ర.

## అదే సమయంలో కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో..

మీ హయాంలో ఒక్క నీటి చుక్క తేలేని రూ.87 కోట్ల కృష్ణా నది తాగునీటి పథకాన్ని నేడు రూ.103 కోట్లకు బలోపేతం చేసి పనులు ప్రారంభించబోతున్నాం. మీరు మోటార్లు అమ్మేసి వేలాది ఎకరాల పంట భూమిని బీడు పెట్టిన వేదాద్రి ఎత్తిపోతల పథకానికి స్వయంగా చంద్రబాబు నాయుడు గారి దగ్గర రూ.15 కోట్లు సాంక్షన్ చేయించి, టెండర్ పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. హనుమంతుపాలెంలో రూ.15 కోట్లతో ఆయుష్ హాస్పిటల్ టెండర్ పూర్తి చేసుకుని పనులు త్వరలో ప్రారంభమవుతున్నాయి. 'మేము వేసిన రోడ్లపై ఎలా నడుస్తారు?' అని అడిగిన మాజీ ఎమ్మెల్యే కి ఒక్క మాట - రోడ్లు ప్రజల సొమ్ముతో వేస్తారు, నాయకుల జేబులోని డబ్బుతో కాదు. ఈ చిన్న లాజిక్ మీరు మిస్ అయ్యారు... ఒకవేళ అదే నిజమైతే - గత నాలుగు దశాబ్దాలలో తెలుగుదేశం పాలనా కాలంలో నిర్మించిన రోడ్లు, నిర్మాణాలపైనే వైసీపీ ఐదేళ్లు ఏలింది. దానికి వారేం జవాబు చెప్తారు? ప్రశ్న వేసే ముందు ఆ ప్రశ్న తమకే తిరిగివస్తుందన్న స్పృహ ఉండాలి. 'శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలతో ఫోటోలు దిగడం అభివృద్ధి కాదు - పనులు పూర్తి చేసి ప్రజల చేతికి అందించడం అభివృద్ధి!'

## ఇసుక, గ్రావెల్ 'కమిషన్ల' అబద్ధం

ఇసుకను ప్రభుత్వం పూర్తిగా ఉచితం చేసింది. గ్రావెల్ తవ్వకాలు ప్రతి వాహనానికి బిల్లులతో, పూర్తి చట్టబద్ధంగా, ప్రభుత్వ అజమాయిషీలో ప్రభుత్వం నిర్ణయించిన వారిచే పారదర్శకంగా నడుస్తున్నాయి. అక్రమ తవ్వకానికి పాల్పడిన వారు ఎవరైనా సరే - ఆఖరికి సొంత పార్టీ వారైనా సరే - పోలీసు కేసులు తప్పలేదు.

ఇందులో 'కమిషన్లు' ఎలా జరుగుతాయో మీకే తెలియాలి ఎందుకంటే 'వసూల్ బ్రదర్స్' అని మీ సొంత పార్టీ వారే మీకు ముద్దుపేరు పెట్టారు, ప్రతిపక్షం కాదు. 'ఇసుక దోపిడీతో సామ్రాజ్యాలు నిర్మించుకున్న వారికి - ఉచితంగా దొరికే ఇసుకలోనూ కమిషన్లు కనిపించడం వారి అవినీతి స్వభావానికే అద్దం పడుతోంది!'

## విగ్రహాలపై కపట ప్రేమ – ఆర్డీవో ఆఫీస్ క్రెడిట్ చోరీ.

దేశ మహనీయుల విగ్రహాలను పోలీసుల కాపలాతో చీకటి రాత్రుల్లో తరలించిన వారే నేడు వాటిపై ప్రేమ చూపుతున్నారు. వైఎస్ఆర్ విగ్రహాన్ని ఎత్తైన స్థానంలో ఉంచి మిగిలినవాటిని ఇష్టానుసారం మార్చాలన్న దుర్బుద్ధే కోర్టు చిక్కుల్లో పడింది. విగ్రహాల తరలింపులో వివక్షను తెలుగుదేశం పార్టీ వ్యతిరేకించింది విగ్రహాలను కాదు. ఆనాటి అత్యుత్సాహమే ఈ చిక్కుముడికి అసలు కారణమని నందిగామ ప్రజలకు తెలుసు.



ఆర్డీవో ఎమ్మార్వో ఆఫీసులు బ్రిటీష్ కాలం నాటి పురాతన వారసత్వ కట్టడాలు. వాటికి రంగులేసి ఆ క్రెడిట్ కూడా దొంగిలించాలని చూడడం చూస్తే - రేపు కృష్ణానది ప్రవాహాన్ని కూడా తమ ఘనతగా చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు. 'సజీవంగా ఉన్న సాటి మనుషులనే ప్రేమించలేని మీరు మహనీయుల విగ్రహాలపై కపట ప్రేమ చూపిస్తే నందిగామ ప్రజలు నమ్మే అమాయకులు కారు!'

## మెగా డీఎస్సీ – స్కామ్ చేసింది ఎవరు?

ఐదేళ్లు 'మెగా డీఎస్సీ వస్తుంది, ఉద్యోగాలు వస్తాయి' అని యువతను మురిపించి ఒక్క ఉపాధ్యాయ నియామకం కూడా చేయలేదు - అది నిజమైన డీఎస్సి స్కామ్. కూటమి ప్రభుత్వం సంవత్సరం తిరక్కముందే 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పారదర్శక

మెరిట్ లిస్ట్ తో జరిగిన ఈ ప్రక్రియను 'స్కామ్' అనడం ఐదేళ్లలో మీరు చేయలేని పనిని కూటమి చేసిందన్న అక్కసు తప్ప మరేమీ కాదు. 'లక్షలాది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన పవిత్ర ప్రక్రియను స్కామ్ అని చెప్పడం - నిరుద్యోగ యువతను ఘోరంగా అవమానించడమే!'

## అమరావతి – మీకు అక్కసు, రాష్ట్రానికి ఆశ..

అమరావతిని ఐదేళ్లు నిలిపివేసి, మూడు రాజధానుల ముసుగులో రాష్ట్రాన్ని అస్థిరత్వంలో ముంచిన వారే నేడు అమరావతిపై అవినీతి ఆరోపణ చేస్తున్నారు. జగన్ పాలనలో పెట్టుబడులు పారిపోయాయి, పోలవరం నత్తనడకన నడిచింది, పరిశ్రమలు సందిగ్ధంలో పడ్డాయి. నేడు కూటమి పాలనలో ప్రపంచస్థాయి నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది పడుతోంది. 'మావిగన్' పేరుతో మీరు తాజాగా రాజధాని విషయంలో మరొకసారి అభాసు పాలవుతున్నారు. 'అమరావతి అంటే మీ కళ్లకు దోపిడీలా కనిపించవచ్చు - ఐదు కోట్ల ఆంధ్రుల పాలిట అది వెలుగుల భవిష్యత్తు!'మొండితోక సోదరులారా - మీ అబద్ధాల వేదికలు దిగి నందిగామ నడిబొడ్డుకు వచ్చి చూడండి. ఇక్కడ జరుగుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధి పనులే మీ ఆరోపణలకు నిలువెత్తు సమాధానం. మీ పాలన కాగితాల మీద మిగిలిపోయింది.మా పాలన ప్రజల జీవితాల్లో కనిపిస్తోంది. ఒక అబద్ధాన్ని వందసార్లు చెప్పొచ్చు కానీ ఒక నిజాన్ని ప్రజలు ఒక్కసారి అనుభవిస్తే చాలు.

## మరణించిన హోం గార్డు కుటుంబానికి రూ.2,18,680 చెక్కును అందజేసిన గుంటూరు ఎస్పీ



**గుంటూరు, జూన్ 12 (మనం న్యూస్ ప్రతినిధి):** శుక్రవారం గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ ఐపీస్, మరణించిన హోం గార్డు స్వర్గీయ ఎస్. శ్రీనివాస వర ప్రసాద్. కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.2,18,680/- విలువైన చెక్కును ఆయన సతీమణి శ్రీమతి సాలి ధనలక్ష్మి గారికి అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీస్ గారు మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది మరియు హోం గార్డులు ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమై ఉంటారని తెలిపారు. విధి నిర్వహణ సమయంలో అనారోగ్యానికి గురై హోం గార్డు శ్రీనివాస వర ప్రసాద్ గారు మరణించడం అత్యంత బాధాకరమని సంతాపం వ్యక్తం చేశారు.మృతుని కుటుంబానికి పోలీసు శాఖ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.గుంటూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోం గార్డులు తమ ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందించగా,ఆ మొత్తంగా సమకూరిన రూ.2,18,680/- చెక్కును ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో హోం గారడ్స్ ఆర్.ఐ. సురేష్ గారు, పోలీసు అధికారులు, హోం గారడ్స్ విభాగ సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్'కు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- బిఎల్ఓలు,బిఎల్ఏలతో సమావేశం
- ఈ నెల 15 నుండి ఇంటింటికి బిఎల్వోలు
- ప్రజలు పత్రాలు, వివరాలు సిద్ధం చేసుకోవాలి
- గుంటూరు తూర్పు ఈఆర్వో, నగర కమిషనర్ మయూర్ అశోక్




**గుంటూరు నగరపాలక సంస్థ జూన్ 12 (మనం న్యూస్ ప్రతినిధి):** దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్) ను విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ కోరారు. శుక్రవారం స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ బిఎల్ఓలు,బిఎల్ఏలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్, ఈఆర్వో మాట్లాడుతూ ఈ నెల 15 నుండి బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) ఇంటింటికి వస్తారని, వచ్చినప్పుడు బీఎల్వోలు అడిగే పత్రాలను, వివరాలను ప్రజలు ఇప్పుడే సిద్ధం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం బీఎల్వోలు మ్యాపింగ్ ప్రక్రియ చేపడుతున్నారని పేర్కొన్నారు.ప్రతి ఓటరుకు రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారని, వాటిలో ఓటరు స్వయంగా పూర్తి చేసి బీఎల్వోకు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఒక ఫారంపై బీఎల్వో సంతకం చేసి ఎక్నాలెడ్జ్మెంట్గా ఓటరుకు అందజేస్తారని చెప్పారు.ప్రజలు తమ ఎపిక్ (ఓటరు గుర్తింపు) కార్డు, రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే 2002 సంవత్సరంలో తాము లేదా తమ కుటుంబ సభ్యులు నమోదు అయి ఉన్నఓటరు జాబితా,పోలింగ్ కేంద్రం వివరాలు, తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు లేదా నానమ్మల ఎపిక్ కార్డులు అందుబాటులో ఉంటే మ్యాపింగ్ ప్రక్రియ మరింత సులభంగా జరుగుతుందని తెలిపారు. వివాహం తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, ఇటీవల ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారు, తమ తల్లిదండ్రుల ఓటరు వివరాలను ముందుగానే సేకరించి ఉంచుకోవాలని సూచించారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా ప్రతి ఒక్కరూ బీఎల్వోలకు సహకరించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, బిఎల్ఏలు కూడా క్షేత్ర స్థాయిలో ఎస్ఐఆర్ పై ప్రజలకు అవగాహన కల్గించాలని కోరారు. ఎస్ఐఆర్ పై శనివారం నుండి ఆదివారం మధ్యాహ్నం వరకు ప్రతి పోలింగ్ ప్రాంతంలో ఓటర్ మ్యాపింగ్ పై స్పెషల్ క్యాంప్ లు జరుగుతాయన్నారు.సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ జి.సాంబశివరావు, ఏఈఆర్ఓలు డి.రాంబాబు, సిహెచ్.శ్రీనివాస్, సూరజ్ కుమార్,ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ బాలాజీబాష, డిప్యూటీ తహశీల్దారు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## నేడే మంగళగిరిలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం వద్ద యోగా కార్యక్రమం



**గుంటూరు, జూన్ 12 (మనంప్రతినిధి):** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా నేడు శనివారం ఉదయం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం వద్ద యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు.ఉదయం ఆరు గంటల నుండి కార్యక్రమం ప్రారంభమవుతుందని,ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు.యోగ గురించి పదే పదే చెప్పడం,ఆచరించడం ద్వారా మరింత మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. యోగను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపు నిచ్చారు. కావున ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో ఎవెన్యూ ప్లాంటేషన్ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్



**గుంటూరు నగరపాలక సంస్థ జూన్ 12( మనం న్యూస్ ప్రతినిధి):** రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో ఎవెన్యూ ప్లాంటేషన్ (రోడ్ల ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం) పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్, హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో నగరంలో పచ్చదనం పెంపొందించడం, పార్కుల నిర్వహణ, పారిశుధ్యంపై అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమవుతున్న తరుణంలో ప్లాంటేషన్ పనులను ఈ నెల 19వ తేదీ నుండే తప్పనిసరిగా ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి అవసరమైన మొక్కలను ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్, జిల్లా అటవీ అధికారికి తక్షణమే లేఖ రాయాలని ఆదేశించారు. నగరంలో ఈదురు గాలుల వలన విరిగిన లేదా కూలిన చెట్ల కొమ్మలను తొలగించే ప్రక్రియను వేగవంతం చేయడానికి ట్రీ కటింగ్ రెండో బృందాన్నికూడా తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు. పనులకు అవసరమైన అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నందున, క్షేత్రస్థాయి పనుల్లో ఖచ్చితమైన పురోగతి కనిపించాలని స్పష్టం చేశారు. నగరంలోని అన్ని పార్కులలో మొక్కలు నాటడంతో పాటు, రోడ్డు డివైడర్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా వాటరింగ్ చేయాలని సూచించారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో స్థానిక ప్రజలను, కాలనీ వాసులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని, అప్పుడే మొక్కల సంరక్షణ బాధ్యతాయుతంగా జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే మొక్కలు నాటే ప్రాంతాల్లో మరియు నగరంలో ఎక్కడా కూడా గ్రీన్ వేస్ట్ లేదా ఇతర వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతరం పారిశుధ్యాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరాన్ని సుందరంగా, పచ్చదనంతో ఉంచేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు సమావేశంలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈ వేణు, ఏడీహెచ్ శాంతి,ఏఈ నాసరయ్య పాల్గొన్నారు.

# యువ క్రికెటర్‌కు అండగా గద్దె క్రాంతి

- పేద క్రీడాకారిణికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత




**విజయవాడ తూర్పు జూన్ 12 (మనం న్యూస్):** క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న పేద విద్యార్థులు, క్రీడాకారులను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. కష్ణలంకకు చెందిన ప్రతిభావంతమైన మహిళా క్రికెటర్ బాలి తమలికకు బ్యాట్ కొనుగోలు, ఇతర క్రీడా అవసరాల కోసం శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.అశోక్నగర్లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గద్దె క్రాంతి కుమార్ ఈ సహాయాన్ని అందజేస్తూ మాట్లాడుతూ, బాలి తమలిక ఇప్పటికే అండర్-15 రాష్ట్ర స్థాయి మహిళా క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి తన ప్రతిభను నిరూపించుకుందని తెలిపారు. ప్రస్తుతం అండర్-19 జిల్లా జట్టుకు ఎంపికై ఉన్నత స్థాయికి చేరుకునే దిశగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభావంతులైన పేద క్రీడాకారులకు భవిష్యత్తులో కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సందర్భంగా బాలి తమలిక మాట్లాడుతూ తన క్రీడా ప్రస్థానానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన గద్దె క్రాంతి కుమార్కు కతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రోత్సాహం తనలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని, ఉన్నత స్థాయిలో రాణించి అందరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, కొక్కెర తిరుపతయ్య, సింగంశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువల పూడిక తొలగింపు పనులు.వర్షపు నీటి నిల్వల నివారణకు చర్యలు 64 డివిజన్ అధ్యక్షుడు రవికుమార్



**విజయవాడ సెంట్రల్ జూన్ 12 (మనం న్యూస్)**64వ డివిజన్లో ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలు పూడికతో నిండిపోవడంతో పలుచోట్ల వర్షపు నీరు రోడ్లపైకి చేరి ప్రజలకు ఇబ్బందులు కలిగించింది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షుడు కే. రవికుమార్ శుక్రవారం పారిశుధ్య సిబ్బందితో కలిసి కాలువల పూడిక తొలగింపు పనులను పర్యవేక్షించారు.డివిజన్లోని ప్రధాన కాలువలు, డ్రైనేజీలను పరిశీలించిన రవికుమార్, నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన పూడిక, చెత్తను వెంటనే తొలగించేలా అధికారులకు సూచనలు చేశారు. వర్షాకాలంలో నీటి నిల్వల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా డివిజన్లో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. వర్షపు నీరు వేగంగా వెళ్లిపోయేలా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా కాలువల్లో చెత్త వేయకుండా సహకరించాలని కోరారు.

# దుర్గమ్మను దర్శించుకున్న కలెక్టర్ దంపతులు





### ▶▶ పల్లకీ సేవలో పాల్గొన్న డాక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ ఇంద్రకీలాద్రి  జూన్ 12 (మనం న్యూస్)ః ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారిని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ దంపతులు శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కలెక్టర్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్ కలెక్టర్ దంపతులకు అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక ఆశీర్వాదాలు అందించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివారి పల్లకీ సేవలో పాల్గొని భక్తిశ్రద్ధలతో సేవలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణపై అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పి. రాఘవరాజు, ఎస్. సరిత, ప్రత్యేక ఆహ్వానితుడు వెలగపూడి శంకరబాబు తదితరులు పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు.

# దక్షిణాసియా క్రీడల్లో బంగారు పతకం



### ▶▶ కానిస్టేబుల్ శ్రీనాథ్‌కు పోలీస్ కమిషనర్ అభినందనలు

విజయవాడ సెంట్రల్, జూన్ 12 (మనం న్యూస్)ః భూటాన్లో జరిగిన 10వ సౌత్ ఏషియన్ ఆట్యా-పాట్యా ఛాంపియన్షిప్లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించిన ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్కు చెందిన కానిస్టేబుల్ సోల శ్రీనాథ్ను నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు అభినందించారు. మైలవరం సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్న శ్రీనాథ్ స్వస్థలం మైలవరం మండలంలోని మొరుసుమిల్లి గ్రామం. 2020 బ్యాచ్కు చెందిన ఆయన ఆట్యా-పాట్యా క్రీడపై ఆసక్తితో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు భూటాన్లోని థింపూ వేదికగా జరిగిన 10వ సౌత్ ఏషియన్ ఆట్యా-పాట్యా ఛాంపియన్షిప్లో భారత జట్టు సభ్యుడిగా పాల్గొన్న శ్రీనాథ్, తన అద్భుత ప్రదర్శనతో బంగారు పతకం సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భంగా శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబును కలిసిన శ్రీనాథ్ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. క్రీడా రంగంలో సాధించిన విజయంపై ప్రశంసలు కురిపించిన కమిషనర్, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పోలీస్ విధులతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న శ్రీనాథ్ విజయాన్ని కమిషనరేట్ అధికారులు, సహచర సిబ్బంది అభినందించారు.

**అర్హత కలిగిన వడ్డెర సొసైటీ ల ద్వారా గ్రావెల్ కంకర తవ్వకాలకు అనుమతినిస్తాం**

**ఇసుక సరఫరా విధానాన్ని పారదర్శకంగా అమలు చేయండి**

**నిబంధనలు ఉల్లంగించకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయండి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



# వడ్డెర కులస్థులకు ఆర్థిక ప్రయోజన
# కంకర గ్రావెల్ త్రవ్వకాలకు అనుమతి

విజయవాడ,జూన్,11,(మనం న్యూస్)ః జిల్లా లో వడ్డెర కులస్థులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర సొసైటీల ద్వారా గ్రావెల్ కంకర తవ్వకాలకు అనుమతులు యిచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఇసుక సరఫరా విధానాన్ని పారదర్శంగా అమలు చేయడంతో పాటు నిబంధనలను ఉల్లంగించకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇసుక సరఫరా అమలు వడ్డెర సొసైటీ ద్వారా కంకర గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు వంటి అంశాల పై కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్లోని ఎ.వి.ఎస్. రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా పరిధిలో తొమ్మిది రీచ్ల ద్వారా ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రస్తుతం 4 లక్షల 48 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో వుంచడం జరిగిందని ప్రజల అవసరాల మేరకు ఇసుక పారదర్శకం గా సరఫరా చేయాలన్నారు. జగ్గయ్యపేట సమీపం లో కృష్ణానది లో మేట వేసిన ఇసుక తొలగింపునకు అనుమతి ఇచ్చేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక అక్రమ రవాణా కాకుండా పోలీసు శాఖ సహకారంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని.. అక్రమ రవాణాకు పాల్పొడే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వడ్డెర కులస్తుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. జీవో నెం.90 ప్రకారం వడ్డెర సొసైటీలకు 50 శాతం రాయితీతో మెటల్, గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం తొమ్మిది వడ్డెర సొసైటీలు ఉన్నాయని, వాటిలో ఇబ్రహీంపట్నం మండలంలో ఆరు, విజయవాడ రూరల్ మండలంలో రెండు సొసైటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి సొసైటీలో కనీసం 25 మంది సభ్యులు తప్పనిసరిగా ఉండాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 100 హెక్టార్లలో మెటల్, గ్రావెల్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, ఎన్టీఆర్ జిల్లాకు 11 హెక్టార్లలో తవ్వకాలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. పరిటాల, జి.కొండూరు మండలాల పరిధిలోని లోయ ప్రాంతాల్లో క్రషర్ యూనిట్లు నిర్వహించుకు నేందుకు కూడా అనుమతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన వడ్డెర సొసైటీలు మెటల్, గ్రావెల్ తవ్వకాలకు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మైన్స్ డీడీ శ్రీనివాస్ కుమార్, ఏడీ కె. వీరస్వామి, డిపివో లావణ్య కుమారి, డిటిసి ఆర్ టి ఓ డి.వి.రమణ కెసి డివిజన్ ఇఇ రవి కిరణ్, నందిగామ ఆర్డీవో అనిల్ కుమార్ సమన్వయ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్న పోలీస్ కమిషనర్



విజయవాడ ఇంద్రకీలాద్రి  జూన్ 12( మనం న్యూస్)ః విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారిని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు దంపతులు శుక్రవారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆశీర్వాదాలు అందించిన పండితులు అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.కె. శీనా నాయక్ పోలీస్ కమిషనర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# చెత్త నుంచి సంపద సృష్టించాలి

### ▶▶ డిపిఓ ధనలక్ష్మి



పామర్రు,జూన్12( మనం న్యూస్)ః గ్రామపంచాయతీ ఏరియాలో్లనిర్మాణం చేసిన (ఎస్డబ్ల్యూపిసిల) చెత్తనుంచి సంపద కేంద్రద్వారాసంపద సృష్టించవచ్చని డిపిఓధనలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని కురుమద్దాలి గ్రామంలో గల చెత్త సంపద కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. దానిలోభాగంగా కురుమద్దాలి గ్రామంలో నీచెత్త సంపద కేంద్రంలో అమలవుతున్న తడిచెత్త పొడిచెత్తవేరుచేయడం, సేంద్రియఎరువునుతయారు చేయడం,వాటిని అమ్మకంను ఇఒపిఆర్డి జనార్ధన్ రావు, కార్యదర్శి భార్గవిలనుడిపిఓఅడిగి తెలుసుకున్నారు. ఈకేంద్రం నిర్వాహన వల్ల గ్రామంలో చెత్త లేకుండాపరిశుభ్రంగాఉంచుకోవచ్చన్నారు. గ్రామంలో వ్యర్థాలను సేకరించి సంపద సృష్టిస్తున్న క్షేత్రస్థాయి అధికార సిబ్బందులను అభినందించారు. మిగిలిన గ్రామాల్లోసైతం ఈ పద్ధతి పాటించి చెత్త నుండి సంపద కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఈ పరిశీలన అనంతరం గ్రామంలోని ప్రతి  ఇంటా డిపిఓ ధనలక్ష్మి తన సిబ్బందితో తిరుగుతూ స్వచ్ఛరథా గ్రామమంతా తిరుగుతుంద లేదా?స్వయంగా గ్రామ ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి భార్గవి పిఓపిఆర్డి జనార్ధన మహిళా సంరక్షణ కార్యదర్శి  పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి



**వీరులపాడు, జూన్ 12(మనం న్యూస్):** వీరులపాడు మండలం జుజ్జూరు కేంద్రంలో జల్లి ఏసోబు కళ్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం ఎంపీపీ కోటేరు లక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.మండల పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో ప్రజలతో ఎన్నుకోబడిన ఎంపీటీసీ సభ్యులకు తెలియకుండా ఎటువంటి పదవులు లేనివారిని అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు ఆహ్వానిస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సందర్భంగా ఎంపీపీ కోటీరు లక్ష్మీ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలని, ఇటువంటి సంఘటన జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారుల పై ఉందన్నారు. ప్రధానంగా వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అంటూ వ్యాధులు ప్రబలకుండా అధికారులు పారిశుద్ధంపై దృష్టి సారించాలన్నారు. ప్రజలు త్రాగే మంచినీరు కలుషితం అవ్వకుండా ఎప్పటికప్పుడు వాటర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు తెలిపారు, అనంతరం పలు శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు షేక్ నాగుల మేర, వేమూరి ఆదం, ఎంపీటీసీ సభ్యులు బండి సీతా మహాలక్ష్మి, శీలం రమణారెడ్డి, పల్లె పోగు మార్తమ్మ, అధికారులు పంచాయతీరాజ్ రవికుమార్, వ్యవసాయ శాఖ అధికారి జోగేంద్ర ప్రసాద్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డేలో పాల్గొని వినతులు స్వీకరించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్



**గుంటూరు జూన్ 12 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డేకార్యక్రమం ఈరోజు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న వివిధ విభాగాల పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత, సర్వీస్ సంబంధిత, బదిలీలు, పదోన్నతులు,సెలవులు మరియు ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను సమర్పించారు. అందిన ప్రతి వినతిని ఎస్పీ శ్రద్ధగా పరిశీలించి,సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని, ఖాళీలు, అవసరాలు మరియు పారదర్శక విధానాలను పరిగణనలోకి తీసుకుని బదిలీలు చేపడతామని ఎస్పీ గారు తెలిపారు.ఎటువంటి సంకోచం లేకుండా,భయాందోళనలకు తావివ్వకుండా పోలీస్ సిబ్బంది తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. సిబ్బంది సమస్యలు సమర్థవంతంగా పరిష్కారమైతేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని ఆయన పేర్కొన్నారు.విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల్లో నమ్మకం మరియు భద్రతాభావం పెంపొందించే విధంగా వ్యవహరించాలని ప్రజలు కు అన్ని స్థాయిల పోలీస్ సిబ్బందికి సూచించారు. పోలీస్ శాఖ ఒక కుటుంబం వంటిది. పరస్పర గౌరవం, సహకారం,సమన్వయంతో పని చేస్తే పోలీస్ వ్యవస్థ మరింత బలపడుతుంది.సిబ్బంది సంక్షేమానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానుఅని ఎస్పీ వకుల్ జిందాల్ గారు అన్నారు.

# కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు రెండేళ్లు..




**మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్**

**పామర్రు పట్టణంలో వైసీపీ నిరసన ప్రదర్శన...**

**రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు..**

**పామర్రు, జూన్ 12( మనం న్యూస్):** రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు పెట్రేగిపోతున్నాయని, ప్రజలకు అండగా వైఎస్సార్సీపీ నిలుస్తుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను, రైతులను, యువతను వంచించి రెండేళ్లు పూర్తయిందని ఆరోపిస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రమైన పామర్రు పట్టణంలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాలమేరకు మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలో వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. వైఎస్సార్సీపీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక సెంటర్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి అనిల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి ప్రభుత్వ విధానాలకు నిరసనగా నాయకులు వినూత్నంగా తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద రూ.1,500, నిరుద్యోగ భృతి కింద రూ.3,000, తల్లికి వందనం కింద రూ.15 వేల చొప్పున ఇస్తామని ప్రకటించి, ఇప్పుడు లబ్ధిదారులను కుదించి ప్రజలను వంచించారని విమర్శించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర కల్పించి పంటలు కొనుగోలు చేశామని, ప్రస్తుతం రైతులకు యూరియా, సాగునీరు కూడా అందక రోడ్లపైకి వచ్చి నిరసనలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. 'అన్నదాత సుఖీభవ' పేరుతో రూ.20 వేలు ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారని ధ్వజమెత్తారు. అధికార బలంతో వైఎస్సార్ కార్యకర్తలను అడ్డుకోవాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన వెన్నుపోటును విస్తృతంగా ప్రచారం చేసి, రానున్న రోజుల్లో ప్రభుత్వాన్ని గద్దె దించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గాన్ని లోని ఐదు మండలాలకు చెందిన వైసిపి ఎంపీపీలు జడ్పీటీసీలు పార్టీ గ్రామ మండల పట్టణ స్థాయి నాయకులు హాజరయ్యారు.

# చంద్రబాబు లాంటి వ్యక్తిని ఎక్కడా చూడలేదు



**రెడ్డిగూడెం,జూన్12(మనం న్యూస్):** రెడ్డిగూడెం మండల వైసీపీ అధ్యక్షులు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మైలవరంలో శుక్రవారం నిర్వహించిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమానికి ర్యాలీగా తరలివచ్చారు. చంద్రబాబు లాంటి వ్యక్తిని దేశంలో ఎక్కడా చూడలేదని, అబద్ధపు హామీలతో ఆయన ప్రజలను వెన్నుపోటు పొడిచారని వెంకటరెడ్డి ఆరోపించారు. ఆయన కుమారుడు లోకేశ్ కూడా ప్రజలను మోసం చేయడంలో గారడి విద్యలు నేర్చుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

# ప్రపంచ వేదికపై తిరువూరు సంగీత ప్రతిభ గిన్నిస్ రికార్డుతో కెవిన్ ప్రేమ్ కొమ్ము ఘనత



**తిరువూరుకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన సంగీత సాధకుడు**

**తిరువూరు,జూన్12(మనం న్యూస్):** తిరువూరు పట్టణానికి చెందిన ప్రముఖ సంగీత ఉపాధ్యాయుడు కెవిన్ ప్రేమ్ కొమ్ము ప్రపంచ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్లో స్థానం సంపాదించి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. సంగీత విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న కెవిన్ ప్రేమ్ కొమ్ము, తిరువూరు, గంపలగూడెం, మధిర, కల్లూరు, సత్తుపల్లి ప్రాంతాల్లో స్వయంగా సంగీత శిక్షణా సంస్థలను స్థాపించి వందలాది మంది విద్యార్థులను నైపుణ్యం కలిగిన సంగీత విద్వాంసులుగా తీర్చిదిద్దుతున్నారు. సంగీతాన్ని కేవలం కళగా కాకుండా జీవితాన్ని సాధనంగా భావించి అనేకమందికి మార్గదర్శకుడిగా నిలుస్తున్నారు.2026 ఫిబ్రవరి 2న నిర్వహించిన ప్రపంచ గిన్నిస్ బుక్ ఆఫ్ రికారడ్స్ కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన సుమారు 2,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో కఠినమైన ఎంపిక ప్రక్రియ అనంతరం 777 మంది మాత్రమే ఎంపిక కాగా, అందులో కెవిన్ ప్రేమ్ కొమ్ము చోటు దక్కించుకుని ప్రపంచ రికార్డు సాధించారు. ఈ అరుదైన ఘనతతో కెవిన్ ప్రేమ్ కొమ్ము పేరు అంతర్జాతీయ స్థాయిలో నిలవడమే కాకుండా, తిరువూరు పట్టణం ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై చాటిచెప్పారు.స్థానికంగా సంగీత విద్యకు చేసిన సేవలకు ఈ గుర్తింపు ఒక మైలురాయిగా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ విజయంతో యువతకు స్ఫూర్తిగా నిలిచిన కెవిన్ ప్రేమ్ కొమ్ముకు వివిధ రంగాల ప్రముఖులు, శిష్యులు, ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.'సంగీతంతో ప్రపంచాన్ని ఆకట్టుకున్న తిరువూరు కుమారుడు - కెవిన్ ప్రేమ్ కొమ్ము' అనే పేరు ఇప్పుడు ప్రాంత ప్రజల గర్వకారణంగా మారింది.

# ప్రకృతి స్ఫూర్తితో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ 'నువా' కలెక్షన్

**గాంధీనగర్ జూన్ 12 మనం న్యూస్:** మలబార్ గోల్ అండ్ డైమండ్స్ తన తాజా న్యాచురల్ డైమండ్ ఆభరణాల కలెక్షన్ నువాను ఆవిష్కరించింది. ప్రకృతిలో కనిపించే సున్నితమైన ఆకృతులు, సహజ నిర్మాణాలు, తేనెగూడు నమూనాలు, భూమి సహజంగా సృష్టించిన ఆకారాలు వంటి అద్భుతాల నుంచి స్ఫూర్తి పొంది ఈ కలెక్షన్ రూపొందించబడినట్లు సంస్థ వెల్లడించింది. 18 క్యారెట్, 14 క్యారెట్ బంగారంతో రూపొందించిన ఈ ఆభరణాల్లో న్యాచురల్ డైమండ్లు, రంగురంగుల రత్నాలు, సిరామిక్ కలర్ ఎనామెలింగ్, బహువర్ణ రోడియం ఫినిష్లతో సమన్వయం చేసి ప్రత్యేక ఆకర్షణీయతను తీసుకొచ్చారు. ఆధునిక విలాసవంతమైన శైలిని, ప్రకృతి అందాలను మేళవిస్తూ వివిధ సందర్భాలకు అనువుగా ఈ డిజైన్లు తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఈ కలెక్షన్కు బ్రాండ్ అంబాసిడర్గా ప్రముఖ నటి కరీనా కపూర్ ఖాన్ కొనసాగుతున్నారు. ఆమె సహజ సొగసు, ఆత్మవిశ్వాసం, ఆధునిక స్త్రీత్వానికి ప్రతీకగా నిలుస్తూ 'నువా' కలెక్షన్ భావాన్ని ప్రతిబింబిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పీ. అహ్మద్ మాట్లాడుతూ, ప్రకృతి సృష్టిలోని సూక్ష్మ నిర్మాణాలు, అందాలను ఆధునిక న్యాచురల్ డైమండ్ ఆభరణాల రూపంలో అందించాలనే ఉద్దేశంతో 'నువా'ను రూపొందించామని చెప్పారు. సొగసుతో పాటు నేటి మహిళల జీవనశైలికి అనుగుణంగా ఉండేలా ప్రతి డిజైన్ను తీర్చిదిద్దినట్లు వివరించారు. సరళమైన విలాసాన్ని, అర్థవంతమైన డిజైన్లు ఇష్టపడే మహిళలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ కలెక్షన్ ద్వారా మలబార్ గోల్ అండ్ డైమండ్స్ తన న్యాచురల్ డైమండ్ పోర్ట్ఫోలియోను మరింత విస్తరించుకుంటోందని సంస్థ వెల్లడించింది.



# మంచి ప్రభుత్వానికి రెండేళ్లు.. అభివృద్ధి, సంక్షేమానికి స్వర్ణయుగం



▸▸ చందర్లపాడు టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య – రాష్ట్ర, నియోజకవర్గ ప్రగతిని ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.

**చందర్లపాడు,జూన్12(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చందర్లపాడు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, విద్యా మరియు వైద్య రంగాల బలోపేతం వంటి అనేక అంశాల్లో ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా నందిగామ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సమగ్రంగా వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, విద్యా సంస్థల అభివృద్ధి, రైతులకు అవసరమైన సేవలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన వంటి పలు కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పారదర్శక పాలన అందిస్తూ, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రానున్న రోజుల్లో మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లి నందిగామ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు,కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయవాడలో కాల్ మనీ దందా

**గాంధీ నగర్, జూన్ 12 మనం న్యూస్:** విజయవాడలో కాల్ మనీ వ్యవహారం మరోసారి కలకలం రేపింది. రూ.5 కోట్ల అప్పుకు ఇప్పటికే రూ.21 కోట్లు చెల్లించినప్పటికీ, ఇంకా డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నారని ఓ మహిళా వ్యాపారిణి చాగర్ల గాయత్రి ఆవేదన వ్యక్తం చేశారు.. వెనిగళ్ల హర్షవర్ధన్ అనే కాల్ మనీ వ్యాపారి తన ఇంట్లోకి చొరబడి తనపై దాడి చేయడంతో పాటు తన కుటుంబ సభ్యులను కూడా బెదిరించి అసభ్యంగా ప్రవర్తించారని వారి నుంచి తనకు ప్రాణహాని ఉందన్నారు. మాచవరం పోలీసులు కేసు నమోదు చేసిన ఇంతవరకు ఏ విధమైన చర్యలు తీసుకోలేదని పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు. గాయత్రి నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాగర్ల గాయత్రి మాట్లాడుతూ, తాను వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం నిర్వహిస్తున్నానని చెప్పారు. వ్యాపార అవసరాల కోసం 2017 నుంచి 2023 మధ్య కాలంలో వెనిగళ్ల హర్షవర్ధన్ అనే వ్యక్తి వద్ద నుంచి విడతల వారీగా మొత్తం రూ.5 కోట్ల వరకు అప్పుగా తీసుకున్నట్లు తెలిపారు.అప్పు ఇచ్చే సమయంలో భద్రత పేరుతో ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, స్టాంప్ పేపర్లు, ఆస్తుల ఒరిజినల్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. అనంతరం తన చిన్న కుమార్తెతో పాటు తన వ్యాపార భాగస్వామి నుంచి కూడా ఖాళీ చెక్కులు, పత్రాలు తీసుకున్నట్లు తెలిపారు. అప్పు తీసుకున్న నాటి నుంచి అసలు, వడ్డీ కలిపి మొత్తం రూ.21 కోట్లు చెల్లించినప్పటికీ పత్రాలు తిరిగి ఇవ్వకుండా, మరో రూ.5 కోట్లు బాకీ ఉందంటూ వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు పేర్కొన్నారు. తమ వద్ద ఉన్న పత్రాలు కావాలంటే అదనంగా డబ్బులు చెల్లించాలని, లేదంటే కోర్టు కేసులతో ఇబ్బందులు పెడతామని బెదిరించినట్లు తెలిపారు. ఈ వివాదం కొనసాగుతుండగానే మే 27న హర్షవర్ధన్ తన తండ్రి హరనాథ్తో కలిసి ఇంటికి వచ్చి తనపై, కుమార్తెలపై దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



తనకు సంబంధించిన ఆస్తి పత్రాలను వేరొకరికి బదలాయించే ప్రయత్నాలు కూడా జరిగాయని , అక్రమ రిజిస్ట్రేషన్ ను వెంటనే నిలుపుదల చేయాలని అధికారులను వేడుకున్నారు..తనకు చెందిన 22 ఎకరాల భూమితో పాటు అపార్ట్మెంట్ ను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. తాను వ్యాపారం నిర్వహిస్తున్న 11 ఎకరాల స్థలంలో ఉన్నటువంటి కార్మికులను బలవంతంగా బయటకు గెంటేసి ఆక్రమించుకున్నారని, అడిగితే కార్మికులపై తనపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మాచవరం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు నిందితులపై ఏ విధమైన చర్యలు తీసుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత ,విజయవాడ పోలీస్ కమిషనర్ ను పలుమార్లు కలిసి తనకు జరిగిన అన్యాయంను వివరించడం జరిగిందన్నారు. ఎ డి సి పి సివిల్ వివాదంలో జోక్యం చేసుకున్నారని, ఆయన అండతోనే నిందితులు తనపై దాడులకు పాల్పడటంతో పాటు బెదిరించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తనకు ఎ డి సి పి తో పాటు అధికార పార్టీకి చెందిన ముఖ్యనేతల అండదండలు ఉన్నాయని, తనను ఎవరు ఏం చేయలేరని ఆస్తి పత్రాలు ఇచ్చే ప్రసక్తే లేదని బెదిరిస్తున్నారని తెలిపారు. పోలీస్ కమిషనర్ ఈ విషయంలో వెంటనే స్పందించి తన ఆస్తి పత్రాలు తనకు ఇచ్చే విధంగా సహాయం చేయాలని ఆమె అభ్యర్థించారు. పోలీసులు తనకు న్యాయం చేయని పక్షంలో ఆత్మహత్య శరణ్యమని తెలియజేశారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా

# పెండింగ్ క్లెయిమ్స్ పరిహారం చెల్లించాలి

▸▸ సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కె.గోపాల్


**నందిగామ,జూన్12(మనం న్యూస్):** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా 2019 వరకు ఉన్న పథకాలన్నీ అమలు చేయాలని పెండింగ్ క్లెయిమ్స్ పరిహారం చెల్లించాలని నందిగామ గాంధీ సెంటర్లో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, నందిగామ నియోజకవర్గ అంబేద్కర్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కె.గోపాల్ మాట్లాడుతూ జూన్ 15వ తేదీన లేబర్ ఆఫీసు వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులందరినీ కోరారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పని చేయించి పథకాలు పునరుద్ధరించాలని మన యూనియన్ చేసిన ఆందోళన వల్ల రాష్ట్ర




ప్రభుత్వం మార్చి ఒకటి నుండి సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయునట్లు ప్రకటించింది దాన్లో నాలుగు పథకాలు మాత్రమే ఉన్నాయి. 2019 వరకు ఉన్న పథకాలు అన్నిటిని పునర్ధరించాలి పెండింగ్లో ఉన్న క్లైమేట్స్ ని నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. జూన్ 15వ తేదీ లేబర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో నిర్మాణ రంగంలో ఉన్న అన్ని వృత్తుల కార్మికులు పాల్గొని ఈ ధర్నాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్ యూనియన్ నాయకులు షేక్ హుస్సేన్, పెయింటింగ్ వర్కర్ యూనియన్ నాయకులు పత్తి హరి, షేక్ బాజీ, రాంబాబు, బాషా,రాము, రామకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

# పన్నెండు సంవత్సరాల పరిపాలన స్వచ్ఛ భారత్

**నందిగామ,జూన్12(మనం న్యూస్):** నందిగామ పట్టణంలో ఈరోజు ప్రధానమంత్రి 12 సంవత్సరాల పరిపాలన పూర్తి అయిన సందర్భ కార్యక్రమాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తొర్లికొండ సీతారామయ్య మాట్లాడుతూ మన భారతదేశంలో దేశ ప్రధానిగా ఉంటూ మొట్టమొదటిసారి దేశ సైనికులను దేశ పారిశుధ్య కార్మికులను వారి పాదాలు కడిగి నెత్తిన చల్లుకున్నటువంటి ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. అదేవిధంగా దేశములో ఉన్నటువంటి చెత్తను పారదోలుతూ దేశాన్ని రక్షిస్తున్నటువంటి ఘనత మోడీదే అదేవిధంగా పట్టణ పల్లె ప్రాంతాల్లో చెత్తను శుభ్రం చేస్తూన్న పారిశుద్ధ్య కార్మికులకు మనమంతా ఎంతో రుణపడి ఉండాలి. ఒక వారం రోజులు చెత్త ఎత్తకపోతే ప్రజలందరికీ ఎంతో అనారోగ్యాల పాలవుతారు. దీనిని దృష్టిలో పెట్టుకొని వారు చేసేటువంటి పనికి వారికి గౌరవాన్ని ఇస్తూ మనము కూడా రోడ్లపై చెత్త వేయడాన్ని తగ్గించి మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేసినటువంటి డస్ట్ బిన్ లో చెత్త వెయ్యాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోవరాజు. పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షులు మునగంటి కామేశ్వరరావు. జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి తొర్లికొండ సీతారామయ్య. బండారు కేదార్నాథ్ శర్మ. చిరుమామిళ్ల శ్రీనివాసరావు. షేక్ బేగం. నూతక్కి విజయ్. దుడ్డు నాగేశ్వరరావు. కేతేపల్లి ఆంజనేయులు. తదితరులు పాల్గొన్నారు



# నందిగామలో రెండేళ్ల వెన్నుపోటు పాలనపై వైసీపీ నిరసన ర్యాలీ



**నందిగామ,జూన్12(మనం న్యూస్):** రెండేళ్ల కూటమి ప్రభుత్వ వెన్నుపోటు పాలనపై భారీ నిరసన ర్యాలీ నందిగామ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. నిర్వహించినారు. మోసాలు, అన్యాయాలు, దగా స్కాముల పై ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు నిరసన తెలిపినారు.సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ .. ఇచ్చిన హామీలను బుట్ట దాఖలు చేస్తూ... రెండేళ్ల చంద్రబాబు వెన్నుపోటు పాలనపై జనాగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నందిగామ పురవీధుల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి... పాదయాత్రగా నడుస్తూ... డౌన్ డౌన్ చంద్రబాబు... డౌన్ డౌన్ కూటమి ప్రభుత్వం... నినాదాలతో హోరెత్తిన ర్యాలీ నిర్వహించారు. నిరసన ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు. చంద్రబాబు రెండేళ్లలో అంతులేని అవినీతి చేసి.. ప్రజలకు వెన్నుపోటు పొడిచారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ప్రజలకు తెలియచేసారు.

# ఎస్ఐఆర్ సమగ్ర సవరణ వర్క్షాప్, క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలు, పోలింగ్ బూత్ కన్వీనర్లతో సమావేశం



▶▶ తంగిరాల సౌమ్య

**చందర్లపాడు,జూన్12(మనం న్యూస్ ):** చందర్లపాడు మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణ వర్క్షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు.క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలు మరియు పోలింగ్ బూత్ కన్వీనర్లతో కలిసి ఎమ్మెల్యే సౌమ్య వర్క్షాప్లో భాగస్వామ్యం వహించి, ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు అప్డేట్ చేయడం వంటి ముఖ్యమైన అంశాలపై వివరంగా చర్చించారు. ఎన్నికల సన్నాహకాలను మరింత సమర్థవంతంగా చేయడానికి అన్ని స్థాయిల్లో సమన్వయం అత్యంత అవసరమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. ప్రతి అర్హుడైన పౌరుడూ తన ఓటు హక్కును సకాలంలో వినియోగించుకునేలా చూడడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆమె తెలిపారు.ఈ సమావేశంలో లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, తెదేపా నేతలు,కార్యకర్తలు, అభిమానులు సానుభూతి పరులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

▶▶ నందిగామలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజా దర్బార్

▶▶ కాకాని నగర్లో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్లో ప్రజల సమస్యలు నేరుగా విని అధికారులకు ఆదేశాలు

**నందిగామ,జూన్12(మనం న్యూస్):**నందిగామ పట్టణం కాకాని నగర్లోని తన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యే ఎదుట నేరుగా వినిపించారు. తంగిరాల సౌమ్య గారు ప్రజలను సానుకూలంగా ఆహ్వానించి, వారి సమస్యలను ఓపికగా విన్నారు. ప్రతి సమస్యను వివరంగా అర్థం చేసుకుని, సంబంధిత అధికారులకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.ఎమ్మెల్యే సౌమ్య ప్రతి సమస్యపై స్పందించి, 'ప్రజల సమస్యలు నా సమస్యలు' అని పేర్కొన్నారు. 'ప్రభుత్వం ప్రజల కోసమే. వారి బాధలు తీర్చడం మా ప్రధాన బాధ్యత' అని ఆమె అన్నారు. ఈ ప్రజా దర్బార్లో స్థానిక అధికారులు హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు.



# వెల్లంకి దళితుల భూమిని కాపాడాలి

**వీరులపాడు జూన్ 12, మనం న్యూస్:** వీరులపాడు మండలం లో వెల్లంకి గ్రామంలోని పేద దళితులకు ఇల్లు స్థలాల కోసం కేటాయించిన భూమిని దళారుల భారీ నుండి కాపాడి, బాధితులకు న్యాయం చేయాలనీ కోరుతూ గురువారం విజయవాడ లో రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మెన్ కు వెల్లంకి గ్రామ దళితులు, ఏం. అర్. పి. ఎస్, ఎం.ఎస్.పి. నాయకులు వినతి పత్రం సమర్పించారు. 1969 లో వచ్చిన భారీ తుపాన్ కారణంగా వెల్లంకి గ్రామం వరద ముంపునకు గురైందని, ఆ సమయంలో బాధితులను ఆదుకునేందుకు విలేజి రికాన్స్ట్రక్షన్ అరగనైజషన్ అనే స్వచ్చంద సంస్థ ముందుకొచ్చిందని, గ్రామాన్ని వరద ముంపు నుండి కాపాడి, ఇల్లు కట్టించి ఇస్తామని నాడు సంస్థ ప్రతినిధులు ఊరులో సమావేశం ఏర్పాటు చేసి హామీ ఇచ్చారని, ఇందు కోసం కొంత నగదును చెల్లించగా సంస్థ నిర్వాహకులు ఇళ్ల స్థలాల కోసం భూమిని కొనుగోలు చేసినారు అని తెలిపినారు. సంస్థ వ్యవస్థాపకులు మైకేల్ ఆంథోని 2009 లో మరణించినారుఅని, ఆ తరువాత సంస్థ లోని కొందరు దళారులు భూమిని అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారని ఎస్సి కమిషన్ ద్రుష్టి కీ తీసుకెళ్లారు. ఈ కార్యాక్రములో మంద పిచ్చయ్య మాదిగ, కోట సుబ్బారావు మాదిగ, నండ్రు సాంబయ్య మాదిగ, నండ్రు బాబు మాదిగ, నండ్రు సతీష్ మాదిగ తదితరులు పాల్గున్నారు.

# రెండేళ్ల కూటమి వెన్నుపోటు పాలనపై విరుచుకుపడిన ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్

**నందిగామ,జూన్12(మనం న్యూస్):** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితమంతా మోసాలు, వెన్నుపోట్లు, దగాలు, స్కాంలే ... కనిపిస్తాయి ... నమ్మి అధికారం ఇచ్చిన ప్రజలకు... ఈ రెండేళ్ళలో ఏమి మంచి చేయకుండా చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడిచారు. రాష్ట్రాన్ని అమరావతి పేరుతో రాజధాని నిర్మాణం అంటూ... చంద్రబాబు కుటుంబానికి ఏటీఎం డెబిట్ కార్డ్ లాగా ఉపయోగించుకుంట ్నారు... రాజధాని నిర్మాణ పనులలో చదరపు అడుగుకు రూ. 4,350 నుంచి మొదలుపెట్టి .. అదే చదరపుకు రూ.20,439 వరకు అంచనా వ్యయాన్ని పెంచి... అడ్డంగా దోచుకుంటున్నారు. రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధర లేదు... యువతకు ఉద్యోగాలు లేవు. నిరుద్యోగులను మెగా డీఎస్సీ పేరుతో .. దగా స్కామ్ నిర్వహించి 1:1 పద్ధతిలో వెరిఫికేషన్ అంటూ స్కామ్ నిర్వహించి అభ్యర్థుల గొంతు కోశారు.చంద్రబాబు రెండేళ్ల పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు లేవు. రైతులకు గిట్టుబాటు ధర లేదు. మహిళలకు మంచి చేసిన పాపాన పోలేదు. ఆరోగ్యశ్రీ నిర్వీర్యం.. మెడికల్ కాలేజీలను మర్చిపోయారు. ప్రాజెక్టులను గాలికి వదిలేశారు. చంద్రబాబు కు కావలసిందల్లా అమరావతి పేరుతో 23 గ్రామాల్లో దోపిడీ తప్ప ఏమి అవసరం లేదు. జగనన్న మావిగన్ పేరు నచ్చకపోతే... ఆయన చేసిన ప్రతిపాదన ప్రకారం మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తెనాలి పట్టణాల మధ్య రాజధానిని అభివృద్ధి చేసి స్టేట్ క్యాపిటల్ రీజియన్ గా చేయాలి... దేశ రాజధాని ఢిల్లీ నగరం కూడా నోయిడా, ఫరీదాబాద్, గురుగ్రాం ఇవన్నీ కలిసి నేషనల్ క్యాపిటల్ రీజియన్ గా అభివృద్ధి జరిగింది ..

**ఇక నందిగామ విషయానికొస్తే...**

నందిగామకు 100 పడకల ఆసుపత్రి మంజూరు చేయించింది ఎవరు ?... కేంద్రీయ విద్యాలయం తీసుకొచ్చింది ఎవరు ?... శివాలయం అభివృద్ధి నిధులు మంజూరు చేయించింది ఎవరు ?.. శివాలయానికి రథాన్ని ఏర్పాటు చేసింది ఎవరు ?.. అదేవిధంగా మీరు నేడు సమావేశాలు జరుపుకుంటున్న బాబు జగజ్జీవన్ రాం భవన్ ను అభివృద్ధి చేసింది ఎవరు ? ఆర్డీవో కార్యాలయాన్ని తీసుకువచ్చింది ఎవరు ? పట్టణంలో ప్రధాన రోడ్లు అభివృద్ధి -విస్తీరణ చేసింది ఎవరు ? . ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తీసుకువచ్చింది ఎవరు ? . అనాసాగరం- డివిఆర్ కాలనీలలో హాస్పిటల్స్ కట్టింది ఎవరు ? అనేది ఎవరిని అడిగినా చెబుతారు. అదంతా జగనన్న ప్రభుత్వంలో మొండితోక బ్రదర్స్ చేసిన అభివృద్ధి అని... మేము గర్వంగా చెబుతాం.. గత 5 ఏళ్ల పాలనలో నందిగామను అభివృద్ధి చేశాం.. సొంతగా పరిపాలించాం... ప్రజలకు మంచి చేసాం కానీ నేడు టిడిపి పాలనలో నందిగామలో డమ్మీ ఎమ్మెల్యే పాలన సాగుతుంది... పరిపాలనంత 'ఏ బాబు' చేతిలో ఉందో అందరికీ తెలుసు. సొంత నిర్ణయం తీసుకోలేని స్థితిలో డమ్మీ ఎమ్మెల్యే కొనసాగుతుంది . గతంలో మాకు వసూల్ బ్రదర్స్ అని పేరు పెట్టిన స్థానిక ఎమ్మెల్యే మరి నేడు చేస్తుంది ఏమిటి ??.. రాఘవాపురం గట్టు మొదలుపెట్టి నియోజకవర్గంలో మట్టి, ఇసుక, గ్రావెల్ అక్రమ తోలకాలతో కమిషన్లు దండుకొని... అవినీతికి అడ్డు అదుపు లేకుండా.. దోచుకొని ... దుర్మార్గ పాలన చేస్తున్నారు. నందిగామలో 100 పడకల ఆసుపత్రిని, కేంద్రీయ విద్యాలయాన్ని మీరు మంజూరు చేయించారా ??.. అని ప్రశ్నిస్తున్నాం.. గతంలో నన్ను ఎవడో టిడిపి వాడు సోషల్ మీడియాలో అడిగాడు ?. ఎక్కడ ఉంది అరుణ్ కుమార్ ఆసుపత్రి - విద్యాలయం అని ... ఇప్పుడు నీ కళ్ళకు కనబడటం లేదా అని చెబుతున్నాం. మా ప్రభుత్వంలో మేము సాధించినవి.. తిరిగి శంకుస్థాపనలు - ప్రారంభోత్సవాలు చేయడం కాదు !!. ఈ రెండేళ్ళలో మీరేం సాధించారో - నందిగామకు ఏం చేశారో చెప్పాలి ?... గెలిచినంత మాత్రాన నాయకులు అయిపోరు... ప్రజల మనసుల్లో స్థానం పొందాలి . కూటమి ప్రభుత్వంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను అన్యాయంగా వేధించిన ఏ ఒక్కరిని వదిలిపెట్టేది లేదు.. రానున్న రోజుల్లో వారికి చట్టబద్ధంగా - న్యాయబద్ధంగా సమాధానం చెబుతాం



# 'వెన్నుపోటు వీరుడు - చంద్రబాబు నాయుడు' అంటూ నిరసన నినాదాలతో మారుమ్రోగిన మైలవరం



- **చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు**
- **భారీ జనసందోహంతో నిరసన ర్యాలీ నిర్వహించిన మాజీ మంత్రివర్యులు జోగి రమేష్**

మైలవరం జూన్ 12 మనం న్యూస్ : మోసపూరిత హామీలతో గద్దినెక్కిన చంద్రబాబు నాయుడు వెన్నుపోటు ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వర్యులు, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్. జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో నిరసనలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి స్థానిక నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఆధ్వర్యంలో, పట్టణంలో భారీ నిసరన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాని కి నియోజకవర్గ నలుమూలల నుండి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు మరియు స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోగి రమేష్ ప్రసంగిస్తూ, నిరుద్యోగ భృతి ఏది..?, కాపు నేస్తం ఏది..?మహిళలకు చేయూత ఏది..?నిరుద్యోగులకు ఉద్యోగాలు ఏవి..? ఈ బి సి నేస్తం ఏది..?రైతలకు ఎరువులు ఏవి.?పండించిన పంటకు గిట్టుబాటు ధర ఏది..?ఆరోగ్యశ్రీ నిర్వీర్యం - ఫీజు రీయింబర్స్మెంట్ కు తూట్లు.. ఇలా ఎన్నో పథకాలు ప్రజలకు ఇవ్వకుండా మోసం చేయడం లేదా చంద్రబాబు నాయుడు?సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను మోసగించిన చంద్రబాబు. కూటమిని నమ్మి ఓట్లు వేసిన ప్రజలను వెన్నుపోటు పొడిచారు. ఎవరిది గొడ్డలి పార్టీ చంద్రబాబు..? - విలువలు, విశ్వసనీయత కలిగిన పార్టీ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ. మూడు పార్టీలు, ముప్పై మంది నాయకులు కలిస్తే జగనన్నను ఆపగలిగారు - ఈ సారి జగనన్న సునామికి మీరు కొట్టుకుపోవాల్సిందే, సిద్ధంగా ఉండండి. రాష్ట్ర ప్రజలు జగనన్న పాలన కోరుకుంటున్నారు. అక్రమ కేసులు పెట్టి నన్ను, నా తమ్ముడుని 83 రోజులు జైలుపాలు చేశారు. రౌడీలతో పెట్రోల్ బాంబులు వేయించి నా ఇంటిమీద లోకేష్ దాడి చేయించాడు. నా ఇంటికి మీ ఇళ్లు ఎంత దూరమో - మీ ఇంటికి నా ఇల్లు అంతే దూరమని గుర్తుపెట్టు కోవాలి. స్థానిక ఎమ్మెల్యే పావలా ప్రసాద్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతూ ..జగనన్నను విమర్శిస్తున్నాడు. నందిగామ లో దిక్కులేకపోతే ఇక్కడకు తీసుకొచ్చి రాజకీయ భిక్ష పెట్టాం. దమ్ముంటే 2029 ఎన్నికల్లో నా మీద పోటీ చేయ్ - నేను ఇక్కడే పోటీ చేస్తా. చంద్రబాబు - లోకేష్ తో మాట్లాడతావో, సూట్కేసులు ఇస్తావో ఇచ్చి తెచ్చుకో సీటు. ఇసుక, మట్టి, బూడిద ఇలా స్థానిక సహజ వనరులు దోచుకుంటూ కృష్ణ ప్రసాద్ మరియు అతని బావమరిది స్మగ్లర్లులా మారారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ కృష్ణ ప్రసాద్ గురించి తెలుసుకోవాలి. తెలుగుదేశం పార్టీ నాయకుల పైనే హత్యాయత్నం కేసులు పెట్టించి, జైలుకు పంపిన ఘనుడు కృష్ణ ప్రసాద్. మన మైలవరాన్ని మనమే కాపాడుకుందాం - మీతో పాటు నేను ఉంటా, మీకు ఏ కష్టం వచ్చినా నేను అండగా ఉంటా.

# పాత పద్ధతిలోనే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- **జూన్ 15న లేబర్ ఆఫీసుల వద్ద ధర్నా : బిల్డింగ్ వర్కర్స్ యూనియన్**

మైలవరం జూన్ 12 మనం న్యూస్ఃభవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా 2019 వరకు ఉన్న పాత పద్ధతిలోనే అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెండింగ్ క్లెయిమ్లకు పరిహారం చెల్లించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిల్లి నరసింహారావు, పి. అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం. శ్రీనివాసరావు, ఎం.సురేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లి నరసింహారావు మాట్లాడుతూ, సీఐటీయూ పోరాటాల ఫలితంగా మార్చి 1 నుంచి సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. 2009లో వచ్చిన సంక్షేమ బోర్డు ద్వారా ప్రమాద మరణం, వివాహ కానుక, ప్రసూతి కానుక, అంత్యక్రియల ఖర్చులు, వైద్య సహాయం, మృతదేహం తరలింపు సహాయం, పిల్లలకు స్కాలర్షిప్ వంటి పథకాలు కార్మికుల కుటుంబాలకు ఆసరాగా నిలిచాయన్నారు. 2020లో నవరత్నాల పేరుతో అప్పటి ప్రభుత్వం అన్ని పథకాలను ఆపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, తూతూ మంత్రంగా 4 పథకాలు మాత్రమే ప్రకటించిందని విమర్శిం చారు. ఆ పథకాలకు పెట్టిన నిబంధనలతో ఒక్క పథకం కూడా కార్మికులకు సవ్యంగా అందడం లేదన్నారు. లేబర్ ఆఫీసర్ ఇచ్చిన ఐడెంటిటీ కార్డు, ఆధార్ కార్డు ఆధారంగా నిబంధనలు



లేకుండా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూన్ 15న రాష్ట్రవ్యాప్తంగా ఏఎల్వో కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్నామని, కార్మికులు జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం. శ్రీనివాసరావు, ఎం.సురేష్ పాల్గొన్నారు.



# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు

మైలవరం జూన్ 12 మనం న్యూస్ ః కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి - ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్సీపి జిల్లా అధ్యక్షులు,తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ దేవినేని అవినాష్, విజయవాడ తూర్పు నియోజకవర్గ అసెంబ్లీ పరిశీలకులు సర్నాల తిరుపతిరావు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తైన సందర్భంగా 'చంద్రబాబు పొడిచిన వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాదిమంది ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. అనంతరం ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలతో కూడిన మేనిఫెస్టోను వైసీపీ శ్రేణులు తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ స్థాయి పదవుల్లో ఉన్న నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు